26CTR1:26CTR1.qxd 6/25/2026 11:33 PM Page 1




# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




## వైభవంగా ప్రారంభమైన తిరుచానూరు తెప్పోత్సవాలు

తిరుచానూరు, జూన్ 25 ప్రభాతవార్త: తిరుచానూరులోన అమ్మవారి తెప్పోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెప్పోత్సవం సందర్భంగా పుష్కరణి యందు రుక్మిణి సత్యభామ సమేత కృష్ణ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీవో హరేంద్రనాథ్ ఏఈఓ దేవరాజులు ఆలయ సూపరింటెండెంట్ మరియు విజిలెన్స్ విభాగము పాల్గొన్నారు

## అప్పలాయగుంటలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వడమాలపేట, జూన్ 25 ప్రభాతవార్త:



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



రాత్రి పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణ మహోత్సవంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలు మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య కర్కాటక లగ్నంలో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకఉ వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో గరుత్మంతుని రూపాన్ని నూతన వస్త్రంపై లిఖించి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్తంభంపై ప్రతిష్టించారు. ఈ ధ్వజారోహణం ద్వారా 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారని ఆగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయి. గరుడ ధ్వజారోహణాన్ని దర్శించిన భక్తులకు విశేష పుణ్య ఫలాలు లభిస్తాయని పురాణాలు వివరిస్తున్నాయి. అంతకు ముందు సుప్రభాతం, విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన తదితర నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తిరుచ్చి ఉత్సవం, భేరితాడనం, భేరిపూజ, నవసంధి, మాడవీధి ఉత్సవం, ఆ స్థానం ఘనంగా నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో స్నపన తిరుమంజనం ఉదయం 10.15 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించారు.

న రాత్రి పెద్దశేష వాహనసేవ

సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు బ్రహ్మోత్సవాల్లో తొలి వాహనసేవ అయిన పెద్దశేష వాహనసేవ వైభవంగా జరగనుంది. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, టీటీడీ సీవీఎస్‌వో కె.వి.మురళీకృష్ణ, ఎస్‌ఈ నరసింహామూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఇతర అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో అంధకారంలో యువత భవిష్యత్తు

### - డ్రగ్స్ వద్దు బ్రో... అను నినాదంతో మారుమ్రోగిన చిత్తూరు- ఎస్పీ ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో ర్యాలీ




చిత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడానికి పోలీసులు కంకణం కట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తుషార్‌డూడి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చిత్తూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ తుషార్ డూడి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల నేతృత్వంలో గురువారం చిత్తూరు నగరంలో డ్రగ్స్ వద్దు బ్రో... అనే నినాదంతో మాదకద్రవ్యాల కట్టడి, అక్రమ రవాణాను నిర్మూలించే అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం కూడవి ఆవరణలో 1,500 మంది విద్యార్థులు హాజరైన ర్యాలీని ఎస్పీ తుషార్ డూడి జెండా వూపి ప్రారంభించి ఎస్పీ విద్యార్థులతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై ప్రజలతో పాటు విద్యార్థిని విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా మాదకద్రవ్యాల వినియోగం పెద్ద ఎత్తున పెరిగిందని, మాదకద్రవ్యాలు వినియోగించే వారిలో యువత ఎక్కువ శాతం వున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు అంథకారం అవుతుందని, సరదాగా ప్రారంభం అయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మారుతుందన్నారు. పోలీసు శాఖ, ఈగల్ టీమ్, ప్రభుత్వ వివిధ శాఖలు వారితో కలిసి మాదకద్రవ్యాలను రూపుమార్చడానికి జిల్లాను 'డ్రగ్స్ ఫ్రీ చిత్తూరు'గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యాపారులపై పిడి యాక్ట్ నమోదు చేస్తున్నామని, చిత్తూరు జిల్లా రెండు రాష్ట్రాలకు సరిహద్దు జిల్లా కావడంతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే అనుమానితులపై నిఘా వుంచామని, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాను కట్టడి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల జ్ఞాపకశక్తి నశిస్తుందని, శారీరక రుగ్మతలు కలిగి చిన్న వయస్సులోనే అనేక రకాలైన వ్యాధులకు గురవుతారని, విద్యార్థిని విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూంగా వుండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం తగ్గించాలంటే ప్రజల్లో, యువతలో మార్పు రావాలని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించి మన జిల్లాను గ్రడ్ ఫ్రీ చిత్తూరు జిల్లాగా తీర్చిదిద్దడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఎక్సైజ్ ఎఎస్పీ వెంకటేష్ ర్యాలీకి వచ్చిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్.షాను, ఏఆర్ ఎఎస్పీ దేవదాస్, ఎక్సైజ్ ఎఎస్పీ వెంకటేష్, చిత్తూరు డిఎస్పీ జె.వెంకట నారాయణ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, జైలు సూపరిటెండెంట్ వెంకట్‌రెడ్డి, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ సూర్యనారాయణ, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, వెస్ట్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, కల్లూరు ఇన్స్‌పెక్టర్ జయరామయ్య, ఆర్‌ఐలు సుధాకర్, చంద్రశేఖర్, వీరేష్‌లు, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కీర్తన, పట్టణ ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా 'సర్' ప్రక్రియ

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



'సర్' పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త:

ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ 'సర్' పురోగతిపై ఇఆర్‌ఓలు, ఏఇఆర్‌ఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఎలక్షన్ డిటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 'సర్' కార్యక్రమం అమలు, ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు, బిఎల్‌ఓలు, ఇతర శాఖల అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ఏ రాజకీయ పార్టీతోనైనా ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధాలు వున్నట్లు రుజువైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే అధికారులు రాజకీయ పార్టీల వాట్సాప్ గ్రూపుల్లో చేరరాదఎని, వారి డేటా లేదా దరఖాస్తులను పంచుకోరాదని, రాజకీయ పార్టీల కార్యాలయాలకు వెళ్ళడం నిషేధమని స్పష్టం చేశారు. అలాగే ఓటరు నమోదు ఫారాల పరిశీలన పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరీని పాటించాలని ఆదేశించారు. అధికారులు అందించే సమాచారం వాస్తవాల ఆధారంగా వుండాలని, జిల్లా ఎన్నికల అధికారికి తప్పుడు సమాచారం ఇవ్వడం నేరమని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడమే ఎన్నికల సంఘం, ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుందన్నారు. ఇఆర్‌ఓలు తమ పరిధిలోని సిబ్బందితో నిత్యం సంభాషిస్తూ పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్డీఓలు శ్రీనివాసులు, భవానీలు, డిపిఎం మధుసూధన్, నియోజకవర్గాల అధికారులు, నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మనవరాలే ఇంటి దొంగ!

### -24గంటల్లో కేసు చేధించిన తిరుపతి రూరల్ పోలీసులు

### -రూ.93లక్షల విలువైన సొత్తు స్వాధీనం





తిరుపతి, జూన్ 25ప్రభాతవార్త:

నమ్మకంగా ఉంటూ సమీప బంధువైన వరుసకు మనవరాలే ఇంట్లో దొంగతనం చేసి ఆపై ఏమీ ఎరుగనట్లు వ్యవహరించడమేగాక చివరకు దొంగతనం చేసిన భారీ నగలతో పట్టుబడటం విస్మయం కలిగించింది. అటు ఫిర్యాదురాలిని ఇటు పోలీసులను ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. చోరీ జరిగిన కొన్నిగంటల్లోనే తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీసులు చాకచక్యంగా చేధించడంతో కేసులో నెలకొన్న ట్విస్ట్ వీడిపోయింది. తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ ఇంటి దొంగతనం కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారినుండి 93 లక్షలు రూపాయలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ దొంగతనం కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందానికి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అభినందనలు తెలిపి రివార్డులు ప్రకటించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఏ .శ్రీనివాసులు వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామం తాటితోపు వెంకటపతినగర్‌లో కె.ఆర్. యశోదమ్మ నివాసముంటుంది. ఆమె ఇంటిలో లేని సమయంలో నిందితులు ఇంట్లోని బీరువా తలుపును విరగ్గొట్టి, అందులో భద్రపరిచిన లాకర్‌ను అపహరించారు. లాకర్‌లో సుమారు 600 గ్రాములకుపైగా బంగారు ఆభరణాలు, ఒక కిలో వెండి వస్తువులు 50 వేలరూపాయలు నగదు దొంగిలించి పరారయ్యారు. ఈ చోరీ పై ఫిర్యాదు అందుకున్న వెంటనే తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారు.క్రైమ్ ఇన్‌చార్జ్ అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో చంద్రగిరి డిఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో తిరుపతి రూరల్ సిఐ మద్దయ్యాచారి ప్రత్యేక బృందాలను దర్యాప్తుకు పురమాయించారు. దర్యాప్తులో ప్రధాన నిందితురాలు సోనియా బాధితురాలికి సమీప బంధువు కావడం, గతంలో బాధితురాలి ఇంట్లో ఉండి ఇంటి పరిస్థితులు, ఆభరణాల నిల్వ ప్రదేశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం వల్ల ముందస్తు పథకం ప్రకారం నంద్యాల బాబు, అనితలతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించింది. ముద్దాయిల వద్ద నుండి చోరీకి ఉపయోగించిన స్కూటర్, లాకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లాకర్‌ను తెరిచి పరిశీలించగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు నగదుతో సహా మొత్తం చోరీ సొత్తును రికవరీ చేశారు.చెర్లోపల్లికి చెందిన పూజారి సోనియా(28), పేరూరుకు చెందిన నంద్యాల బాబు( 31), సింగాలగుంటకుచెందిన ఐలోని అనిత(26)లుగా గుర్తించి అరెస్ట్ చేశా రు. తిరుపతి రూరల్ సిఐ మద్దయ్యాచారి, ఎస్‌ఐలు లోకేష్ కుమార్, శ్రీరామ్, జ్యోతి,సిబ్బంది లక్ష్మీ ్మ ప్రసాద్, సూర్య ప్రసాద్, ప్రశాంత్ కుమా ర్, రమేష్, దాసు నాయుడు, శ్రావణిలను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు అభినందించి, ప్రశంసాపత్రాలతో రివార్డులు



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అధికారులు , వివిధ రాజకీయ పార్టీల నాయకులు , వారి ప్రతినిధులతో సమావేశమైన తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎస్.వెంకటేశ్వర్ తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త

## పర్యాటక రంగంగా కోడూరుకు అవకాశం ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్

రైల్వే కోడూరు అర్బన్, జూన్ 25, ప్రభాతవార్త.



అప్పటి కడప జిల్లా,నిన్నటి అన్నమయ్య జిల్లా,నేటి తిరుపతి జిల్లా అయిన రైల్వే కోడూరు పట్టణానికి పర్యాటక రంగం మహర్దశకు అవకాశం వచ్చిందని రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. గురు వారం కోడూరు పట్టణంలోని ఎర్రచం దనం పార్కులో డిఎఫ్ఓ జగన్నాథ్ సింగ్, నియోజకవర్గంలోని రేంజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 12 నియోజకవర్గాల్లో నగరవణాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టుబోతుందన్నారు. ఇందులో రైల్వే కోడూరు నియోజకవర్గానికి కూడా అవకాశం దక్కిందన్నారు. ఈ నగరవణాన్ని ప్రజల ఆనందాల కోసం వీక్షి ంచేందుకు ఎర్రచందనం పార్కులో నగరవనం ఏర్పాటుచేసి పార్కును పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. దీనికిగాను ప్రత్యేకంగా సమావేశం లో అటవీశాఖ అధికారులతోను, అన్ని రకాల పనులు చేసేందుకు కృషి చేయాలని డియఫ్ఓకు సూచించారు. ఈనెల 26న నగరవణానికి ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపట్టి దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైతే జూలై రెండవ తేదీన రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం ముక్కావారి పల్లి పంచాయతీలో రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రులతో భారీ బహిరంగ సభ కూడా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి వచ్చే ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి కూడా నగరవణాన్ని పరిశీలించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ సంగరాజు రవిరాజు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి తతంశెట్టి నాగేంద్ర, చిట్వేలి, కోడూరు, బాలుపల్లి రేంజర్లు పాల్గొన్నారు.

# తిరుపతి టిడిపికి దిక్కెవరు !

### చుక్కాని లేని నావలా పార్టీ

### -ఇప్పటికీ ఊసే లేని సంస్థాగతం

ప్రభాతవార్త-తిరుపతి:

సిఎం చంద్రబాబు సొంత జిల్లా ,ఎంతో ప్రతిష్టాత్మకమైన తిరుపతిలో టిడిపి పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. అసలు పార్టీకి దిక్కుమొక్కూ లేకపోవడంతో పార్టీ సంస్థా గత ఎన్నికల ఊసే లేదు. ఇప్పటికే పార్టీ అధిష్టానం సంస్థాగత ఎన్నికలు నిర్వహించి పార్టీ కేడర్‌ను ఉత్సాహపరచాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా తూతూమంత్రంగా పర్యటించి తనవారితో కలసి తిరిగి వెళ్ళిపోతున్నారు. పార్టీ కేడర్‌ను బలోపేతం చేసి ఆ దిశగా తిరుపతిలో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి తెలుసుకోవడంలో కూడా విఫలమయ్యారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు వచ్చిన వారు ఎవరికి వారే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. అందరినీ ఒక తాటిపై నడిపే నాధుడే కరువయ్యారు. తిరుపతిలో 50 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 52వేలమంది సభ్యత్వం ఉంది. 3లక్షల ఓటర్లు ఉన్నారు. ఈ డివిజన్లలో అధ్యక్ష,కార్యదర్శుల పదవులు ఇస్తే మరింతగా యువత పనిచేస్తారు. త్వరలోనే నగరపాలకసంస్థ ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సమయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు ,సిఎం చంద్రబాబు నాయుడు, కార్యనిర్వహక అధ్యక్షుడు ,మంత్రి నారా లోకేష్ పార్టీని గాలికి వదిలేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్య ప్రసాద్ ఒక వర్గానికే ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి .40 ఏళ్లుగా పార్టీని భుజాలపై మోసిన సీనియర్ నేతలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏడాది క్రితం ఎమ్మెల్యేలు లేని నియోజక వర్గాలలో నియోజక వర్గం ఇన్‌చార్జీలను నియమించారు. అయితే తిరుపతిలో కొత్త ఇన్‌చార్జిని నియమించడానికి సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి పదవి ఇస్తే ఏమవుతుందనే అంతర్మధనంతో అధిష్టానం కూడా మీన మేసాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుత తాత్కాలిక ఇన్‌చార్జి మున్నూరు సుగుణమ్మకు రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె స్థానంలో కొత్త వారిని నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. పార్టీకి దీర్ఘకాలం సేవలందించిన వారిని కాదని మరి కొందరి పేర్లు జోరుగా వినిపించాయి. కొత్త నేతలు కొందరు ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి నారా లోకేశ్ ద్వారా పదవి కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఇక్కడ బలిజ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నందున ఇన్‌చార్జి పదవి ఆ వర్గం నేతకే కేటాయించాలని కొందరు వాదిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే ఆ వర్గానికి చెందిన వారు కాబట్టి మరొక వర్గానికి ఇస్తే సామాజిక న్యాయం చేసినట్టు ఉంటుందని మరికొందరు వాదిస్తున్నారు. రెడ్డి, కమ్మ, బిసి, ఇతర వర్గాల నేతలు ఇన్‌చార్జి పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. తిరుపతిలో వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్ రెడ్డి బలమైన నేతలుగా క్షేత్రస్థాయిలో జనంవైపు ఉన్నారు. వారికి లోక్ సభ సభ్యుడు గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మేయర్ శిరీష యాదవ్ తోడుగా ఉన్నారు. ఈ నేపద్యంలో అన్ని విధాలా సమర్థ మైన నేతను తిరుపతి టిడిపి ఇన్‌చార్జిగా నియమించాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు.



# చంద్రగిరిలో భూ రికార్డుల కలకలం

### -రాత్రికి రాత్రే మాయమవుతున్న రెవెన్యూ రికార్డులు!



తిరుపతిరూరల్,జూన్ 25 ప్రభాతవార్త:

చంద్రగిరి నియోజకవర్గంలో భూముల భద్రతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవిలాల లెక్కదాఖల సర్వేనెంబర్ 476/1లో ఉన్న 3.17 ఎకరాల విలువైన భూమి రికార్డులు ఒక్క రాత్రిలో మారిపోవడం, మరుసటి రోజే కొత్త యజమానుల పేర్లు నమోదు కావడం సంచలనంగా మారింది. ఈ ఘటనను ఉదాహరణగా చూపుతూ ప్రతిపక్ష నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధికార పార్టీపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. గురువారం తుమ్మలగుంటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ వ్యవస్థే భూ మాఫియాకు అండగా మారిందని విమర్శించారు. ఇప్పటివరకు ప్రభుత్వ భూములపై కబ్జాలు సరిపోలేదన్నట్టు ఇప్పుడు ప్రవేట్ భూములపైనా దృష్టి సారించారని ఆరోఫించారు. అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులు రెవెన్యూ అధికారుల సహకారంతో భూముల రికార్డులను మారుస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతిరూరల్ అవిలాలలో సుమారు రూ.100కోట్ల విలువైన భూమి వ్యవహారంలో అసలు యజమానుల పేర్లు తొలగించడం, అధికార పార్టీకి అనుబంధంగా వున్న వ్యక్తుల పేర్లు చేరడం వెనుక పెద్ద కుట్రదాగి ఉందని ఆరోఫించారు. బాధితుల వాగ్మూలాల ప్రకారం ఈ వ్యవహారంలో ఉన్నత స్థాయి నాయకుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం చంద్రగిరిలో "భూమి మీది అయినా...రికార్డు ఎవరిదో చెప్పలేని పరిస్థితి నెలకున్నదని ఆయన మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మరిచి, అధికార పార్టీ నాయకులకు ఏజెంట్లుగా పని చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా భూ ఆక్రమణలు ఒక్క అవిలాలకే పరిమితం కావని, చంద్రగిరి మొత్తం మీద ఇంకా వెలుగులోకి రాని అనేక కేసులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు వెంటనే తమ భూముల వివరాలను రెవెన్యూ అన్‌లైన్ రికార్డులో తనిఖీ చేసుకోవాలని సూచించారు. 'ఈ రోజు అవిలాల...రేపు ఎవరి భూమి రికార్డు మాయమవుతుందో చెప్పలేం' అంటూ హెచ్చరించారు. భూముల భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని లేకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ వ్యవహారంలో తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ...తిరుపతిరూరల్ తహశీల్దార్ జనార్ధన్‌రాజు భిష్యత్‌లో జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, మునీశ్వరరెడ్డి, మూలం చంద్రమోహన్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్త, శుక్రవారం 26, జూన్ 2026

చెలి

# అన్నీ తానైతే !



పిల్లలే లోకంగా బతికేస్తారు కొందరు అమ్మలు. వారికోసం ఇష్టాలు, కెరియర్ వదిలిపెడతారు. అలాంటివారికి పిల్లలకు దూరంగా బతకడం ఎంత కష్టం? దీన్నే 'ఎమ్టీ నెస్ట్ సిండ్రోమ్'గా చెబుతున్నారు నిపుణులు.

పిల్లలకు టిఫిన్, పుస్తకాలు గుర్తు చేయడం, సమయానికి స్కూలు, కాలేజీకి పంపడం.. వాళ్లలా అడుగు బయటపెట్టగానే వారి తాలూకా పుస్తకాలు, దుస్తులు సర్దడం..తిరిగి సాయంత్రానికి స్నాక్స్, భోజనం సిద్ధం చేయడం.. క్షణం తీరిక లేదన్నట్టుగా సాగుతుంది అమ్మల జీవితం. ఒక్కసారిగా పిల్లలు భవిష్యత్తు నిర్మించుకోవడానికని ఆమెకు దూరమయ్యాక బోలెడు ప్రశ్నలు వేధించడం మొదలు పెడతాయి. ఉరుకులు పరుగు లుండవు. ఇల్లంతా బోసిగా కనిపిస్తుంది. సరిగా తిన్నారో లేదో! ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో! సురక్షితంగా చేరుకున్నారో లేదో.. ఇలా అనుకుంటూ భయపడటమే కాదు.. ఏడ్చేస్తుంటారు కూడా. ఇవన్నీ ఎమ్టీనెస్ట్ సిండ్రోమ్ లక్షణాలేనట. ఒంటరి తల్లులు, ఏకైక సంతానం ఉన్నవారు దీని బారిన పడుతున్నారట. అలాగని పిల్లలను భవిష్యత్తును నిర్మించుకోకుండా ఆపలేం కదా! ఈ ఆలోచనలతో నిండిపోతే మానసిక సమస్యలు ఎదురవుతాయి. దాన్నుంచి బయటపడ టానికి.. కొత్త వ్యాపకాలు, అలవాట్లను ఏర్పరచుకోమంటున్నారు నిపుణులు. వాటిలో పడి, ఈ బాధనుంచి బయట పడతారట. ఇంకా పిల్లలతో ఫోన్, వీడియో కాల్స్ మాట్లాడటం, వీలున్నప్పుడల్లా సర్‌ప్రైజ్‌లిస్తూ కలిసొచ్చినా మంచిదే. ఇంకా చేయాలనుకుని పక్కన పడేసిన పనులపై దృష్టి పెట్టినా.. ఈ ఖాళీ భావన దూరమవుతుంది. మిమ్మల్ని మీరు కొత్తగా పరిచయం చేసుకునే వీలుంటుంది. □

## కసరత్తులు చేస్తున్నారా?



క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారికి ఎక్కువ శక్తి నిచ్చే కొన్ని పోషకాలు అవసరమవుతాయి. అవేంటంటారా?

✪ కసరత్తులు చేసేవారు తప్పనిసరిగా రోజూ గుప్పెడు బాదం నానబెట్టి తీసుకోవాలి. ఇవి కండరాలకి శక్తినిస్తాయి. చెడుకొవ్వుల్ని కరిగించి.. రక్తంలో చక్కెర స్థాయులను అదుపు చేస్తాయి.

✪ ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి. పీచు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే యాపిల్, జామ, బొప్పాయి వంటివి తీసుకోవాలి. ఇవి హృదయ సంబధిత రోగాలను రానివ్వవు. వ్యాయామానికి ముందు కొన్ని నట్స్ తీసుకోవడం వల్ల మెదడు, శరీరం మరింత ఉత్సాహంగా పనిచేస్తాయి. కండరాల పనితీరుకీ ఎముకల ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లూ, మెగ్నీషియం, ఫైబర్ మెండుగా ఉండి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. □

# త్యాగానికి, సత్య నిరతికి ప్రతీక ముహర్రం




ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల పేరు ముహర్రం. సాధారణంగా దీనిని ఒక పండుగగా భావిస్తారు, కానీ వాస్తవానికి ఇది పండుగ కాదు; ఇదొక శోకదినం. సత్యం కోసం, మానవీయ విలువల రక్షణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఒక గొప్ప త్యాగనిరతికి, వీరత్వానికి ఇది స్మరణ దినం. కర్బలా యుద్ధం చారిత్రక నేపథ్యం క్రీస్తుశకం 680 (హిజ్రీ 61) లో ఇరాక్‌లోని కర్బలా మైదానంలో జరిగిన చారిత్రాత్మక పోరాటమే ముహర్రం వెనుక ఉన్న అసలు నేపథ్యం. మహమ్మద్ ప్రవక్త మనవడైన హజ్రత్ ఇమామ్ హుస్సేన్, అప్పటి క్రూర, నిరంకుశ పాలకుడైన యజీద్ విధించిన అన్యాయమైన ఆధిపత్యాన్ని అంగీకరించడానికి నిరాకరించారు. యజీద్ లొంగిపోవాలని ఎంత ఒత్తిడి చేసినా, హుస్సేన్ ధర్మాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికే మొగ్గు చూపారు. కేవలం 72 మంది ఉన్న హుస్సేన్ సైన్యంపై యాజిద్‌కు చెందిన వేలాది మంది సైనికులు దాడి చేశారు. మొహర్రం నెల 10వ రోజును 'ఆషూరా' అంటారు. ఇమామ్ హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యులు, పసిపిల్లలు దాహంతో అల్లాడిపోతూ కూడా శత్రువుకు లొంగిపోకుండా వీరమరణం పొందారు.ముహర్రం ఇచ్చే అంతిమ సందేశంకర్బలా యుద్ధం కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య లేదా రెండు సైన్యాల మధ్య జరిగిన ఒక సాధారణ పోరాటం కాదు. అది 'అధర్మంపై ధర్మం' సాధించిన ఆత్మీయ విజయం. ఈ నిరంతర స్మరణ సమాజానికి కొన్ని అమూల్యమైన సందేశాలను ఇస్తుంది: 1.సంఖ్యాబలం, ఆయుధబలం కంటే ఆశయబలమే గొప్పదని కర్బలా నిరూపించింది. 2. అన్యాయం, అక్రమాల ముందు మోకరిల్లడం కంటే, ధర్మం కోసం ప్రాణాలు అర్పించడం మిన్న అనే సత్యాన్ని ఇది చాటింది. అందుకే మహాత్మాగాంధీ సైతం మామ్ హుస్సేన్ త్యాగం నుండి నేను శత్రువుకు లొంగిపోకుండా పోరాడే నైతిక శక్తిని పొందాను!" అని కొనియాడారు. అందరికీ స్ఫూర్తిదాయకం! ప్రతి మనిషి ముందూ ధర్మంఅధర్మం, సత్యంఅసత్యం, న్యాయంఅన్యాయం అనే రెండు ఆప్షన్స్ వచ్చి నిలుస్తూ ఉంటాయి. వాటిలో ఎంపిక చేసుకునే సందర్భంగా ఆంతర్యంలో జరిగే సంఘర్షణే కర్బాలా యుద్ధం. కాబట్టి ముహర్రం కేవలం ఒక్క ముస్లిములకే కాక, ప్రతి మనిషికీ స్ఫూర్తి, మార్గదర్శకం అవుతుంది. తెలుగునాట మొహర్రం పీర్ల పండుభారత దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో మొహర్రానికి ఒక అద్భుతమైన సాంస్కృతిక రూపం ఉంది. ఇక్కడ దీనిని 'పీర్ల పండుగ' అని పిలుస్తారు. ఈ వేడుకల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి కులమతాలకు అతీతంగా సాగుతాయి. గ్రామాలలోని చావడిలలో 'పీర్లు' (ఇమామ్ హుస్సేన్ మరియు ఆయన అనుచరుల గుర్తుగా చేసే ప్రతిమలు) ప్రతిష్ఠిస్తారు.హిందూముస్లింలు కలిసి భక్తిశ్రద్ధలతో పీర్ల సాఖిలు (శోక గీతాలు) పాడటం, అలాయ్ బూడిద చల్లుకోవడం, అగ్నిగుండాలు తొక్కడం వంటి ఆచారాలను నిర్వహిస్తారు.ఇది భారతదేశపు గంగాజమునా తెహజీబ్ (మత సామరస్య సంస్కృతి)కి అత్యున్నత ప్రతీకగా నిలుస్తుంది.ముహర్రం సంఘటన కేవలం ఒక నిర్దిష్ట వర్గానికి పరిమితమైన శోకం కాదు. అది యావత్ మానవాళికి నైతిక స్థైర్యాన్ని ఇచ్చే ఒక సార్వజనీన ధర్మ పాఠం. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా దానిని నిలదీయాలనే బాధ్యతను, మానవత్వం కోసం త్యాగానికి సిద్ధపడాలనే సందేశాన్ని ముహర్రం ప్రతి ఏటా ప్రపంచానికి గుర్తు చేస్తూనే ఉంటుంది. ఇక దాని నుండి స్ఫూర్తిని పొంది, అధర్మం నుండి ధర్మం వైపునకు మరలేవారే ధన్యజీవులు!

**- ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

# మట్టిలో ఆడనిద్దాం !



పిల్లలు మట్టిలో ఆడుతుంటే.. వద్దని చెప్పే స్తాం. చేతులు మురికి చేసుకుంటున్నారని కానీ, ఇది వారిలో వ్యాధినిరోధక శక్తిని పెంచ డమే కాదు... మరెన్నో ఆరోగ్యకర ప్రయోగం అందిస్తుందని తెలుసా? 2024లో ఓ అమె రికన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయ నం.. మట్టిలో ఉండే 'మైకోబ్యాక్టీరియం వాక్సీ' అనే సూక్ష్మజీవులు.. చిన్నారుల శరీరంలోకి ప్రవేశించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయని వెల్లడిస్తోంది. అంతేకాదు, ఇవి సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ఆనందాన్నీ పెంచుతా యట. అలర్జీలు, ఆస్తమా వంటి వ్యాధుల ప్రమా దాన్నీ తగ్గిస్తాయి. ఇక, మట్టి టెక్స్చర్, చల్లదనం, వాసన.. వంటివి ఇంద్రియ జ్ఞానాన్ని ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా వారి నాడీ వ్యవస్థ బలోపేతం అవుతుంది. సులువుగా దేన్నైనా గ్రహించ గల శక్తీ ఏర్పడుతుందట. అలానే, మట్టి తో ఆటలాడుతూ తయార ఒచేసే ఇళ్లు, జంతువులు.. వంటి బొమ్మ రూపాలు వారిలో సృజనాత్మకతను పెంచు తాయి. దీంతో స్క్రీన్ టైమ్ కూడా తగ్గి శారీరకంగానూ చురుగ్గా ఉంటారట. మరి ఇప్పుడైనా వారిని మట్టిలో ఆడనిస్తారా? □

# నప్పకపోతే.. అంతే !



**ఈ దుస్తుల మీదకు నప్పుతాయి. ఇది కొత్త ట్రెండ్ అంటూ కోరి కోరి షూ, చెప్పులను ఎంచుకుంటాం. తీరా వేసుకున్నాక ఇబ్బందిపడే సందర్భాలెన్నో. ఒక్కోసారి పాదాల నొప్పులూ మొదలవుతాయి. అలాగని పట్టించుకోకపోతే ఆర్థరైటిస్ సహా ఎన్నో సమస్యలు ఇబ్బంది పెడతాయి కాబట్టి...**

చెప్పుల విషయంలో ఆకర్షణీయంగా ఉండటం ఒక్కటే ప్రామాణికం కాకూడదు. డిజైన్ బాగుంటే చాలని ఎప్పుడూ తీసుకోకూడదు. వాటి నాణ్యత కూడా గమనించు కోవాలి. కాలికి సరిపోయిందా లేదా అనేకాదు. నడిచేప్పుడు సౌకర్యంగా ఉన్నాయా అన్నదీ గమనించు కోవాలి. ఏమాత్రం అసౌకర్యం కలిగించినా, ఇబ్బంది పెట్టినా 'తర్వాత సర్దుకుంటాయి' అని కూర్చోక దూరం పెట్టడమే మేలు. ఎక్కువసేపు నిలబడడం, వాకింగ్, షాపింగ్.. ఇలా బోలెడు అవసరాలు ఉంటాయి. వాటికీ సౌకర్యంగా ఉండాలి. కాబట్టి, ఫ్యాషన్‌ని మాత్రమే కాకుండా సౌకర్యంగా ఉందా అనేదీ చూసుకోండి. నాలుగు అడుగులు అలా వేసి కాక, కొద్దిసేపు గమనించి చూడండి. అప్పుడే అవెంతవరకూ మీకు సరిపోతాయో తెలుస్తుంది. ఒక్కో డ్రెస్ మీదకి ఒక్కో పాదరక్షలు కొంటూ పోతే ఎలా? మ్యాచింగ్ కావాలి కానీ ఇలా అన్నీ కొను క్కుంటూ పోయినా వృథానే. కాబట్టి కాస్త క్లాస్‌గా ఉండే రంగులను ఎంచుకునే ప్రయత్నం చేయండి. ఇవి ఎటువంటి డ్రెస్సులు, చీరలు, కుర్తీల మీదకు అయినా ఇట్టే నప్పుతాయి. ఇక వెస్ట్రన్ మేర్‌కు షూస్ అయితే మేలు. ఈ రోజుల్లో చీరల మీదకీ షూ వాడుతున్న వారూ ఉన్నారు. మీదీ అదే కోవ అయితే వైట్, బ్లాక్, క్రీమ్ వంటి రంగు తీసుకుంటేకొంచెం టెండీగా ఉంటాయి. □

# గులాబ్ ఫిర్నీ



**కావలసినవి :** పాలు: లీటరు, యాలకుపొడి : అరటీస్పూను, బాస్మతి బియనయం: పావు కప్పు, పంచదార: కప్పు, రోజ్ సిరప్:2 టేబుల్‌స్పూన్లు, బాదం : టేబుల్‌స్పూన్లు, ఎండిన గులాబీ రేకులు : కొద్దిగా .

**తయారుచేసే విధానం :** బియ్యం కడిగి అరగంటసేపు నాననివ్వాలి. తరవాతమెత్తగా రుబ్బాలి. మధ్యలో నాలుగైదు టేబుల్‌స్పూన్ల పాలు కూడా పోయాలి. మందపాటి బాణలిలో పాలు పోసి కాగనివ్వాలి.అవి మరిగిన తరవాత రుబ్బిన బియ్యం ముద్ద వేసి సిమ్‌లో ఉడికించాలి. ఉండలు కట్టకుండా మధ్యమధ్యలో తిప్పుతూ మిశ్రమం చికనకబడేవరకూ సుమారు అరగంటసేపు ఉడికించాలి. తరవాత పంచదార, రోజ్‌సిరప్ వేసి కలపాలి.ఇష్టానినబట్టి పంచదార, రోజ్‌సిరప్ మరికాస్త వేసుకోవచ్చు. తరవాత స్టవ్ ఆఫ్ చేసి కాసేపు అలాగే ఉంచి చిన్న చిన్న బౌల్స్‌లో చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టి తీయాలి.ఇప్పుడు ఒక్కోదాంట్లో సన్నగా తరిగిన డ్రైనట్స్ గులాబీ రేకులు చల్లి అందించాలి. □




## సుస్వర తరంగ్ హీరోగా సురవి విజన్స్
# 'ప్రొడక్షన్ నం1' ప్రారంభం

ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు సుస్వర తరంగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. వీరేష్ కోకా దర్శకత్వంలో సురవి విజన్స్ బ్యానర్‌పై పి చక్రధర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ డాలీ క్లాప్ కొట్టి గౌరవ దర్శకత్వం వహించారు. గంటా రవితేజ కెమరా స్విచ్ ఆన్ చేశారు. నల్లమలుపు బుజ్జి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించారు. ఈ చిత్రంలో దివ్యాని మొండల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. చంద్రశేఖరన్ డీవోపీగా, బిబిన్ అశోక్ సంగీత దర్శకుడిగా, నిరంజన్ దేవరమానే ఎడిటర్ గా పని చేస్తున్నారు. జూన్ 29 నుంచి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..'నేను 275కు పైగా సినిమాలకు పని చేశాను. ప్రేక్షకులు నాకు ఎంతో ప్రేమ, అభిమానాన్ని అందించారు. ఇప్పుడు ఈ సినిమాతో మా అబ్బాయి హీరోగా పరిచయం అవుతున్నాడు. అదే ప్రేమ, అభిమానాన్ని తనపై కూడా చూపిస్తారని కోరుకుంటున్నాను' అన్నారు. హీరో సుస్వర తరంగ్ మాట్లాడుతూ.. 'నాకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన మా దర్శకుడు, నిర్మాతతో పాటు మా టీమ్ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నా తొలి సినిమాకే ఇంత మంచి అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. దర్శకుడు వీరేష్ కోకా మాట్లాడుతూ.. 'నన్ను, నా టీమ్‌ను నమ్మి వందేమాతరం శ్రీనివాస్ వారి అబ్బాయిని హీరోగా పరిచయం చేసే బాధ్యత మాకు ఇచ్చారు. వారు పెట్టుకున్న నమ్మకాన్ని కచ్చితంగా నిలబెట్టుకుంటాను' అన్నారు. హీరోయిన్ దివ్యాని మాట్లాడుతూ.. 'తెలుగులో ఇది నా తొలి సినిమా. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా దర్శకుడు, నిర్మాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు' అన్నారు..

## హీరో ప్రియదర్శి కాంబో మూవీ
# 'ఇడుపు కాయితం'




ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. అల్లు అరవింద్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నటుడు బిత్తిరి సత్తి మాట్లాడుతూ 'ఇడుపు కాయితం' సినిమా ప్రారంభోత్సవం చూస్తుంటే ఒక పండుగ వాతావరణం కనిపిస్తోంది' అన్నారు. నటి సావిత్రి మాట్లాడుతూ 'నటిగా నా మొదటి సినిమా ఇది. ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన డైరెక్టర్ వంశీ అన్నకు థ్యాంక్స్' అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ 'ఈ కథ విన్న తర్వాత, ఇంతమంది టీమ్ మెంబర్స్ ప్రాజెక్ట్‌లోకి వచ్చాక, నాకు ఒక్కటే అనిపిస్తోంది. ఈ 'ఇడుపు కాయితం' పంచాయితీకి మూవీ రిలీజైన ఫస్ట్ డే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి చూస్తారు' అన్నారు. డైరెక్టర్ వంశీకృష్ణ దొండపాటి మాట్లాడుతూ 'ఈ కథ చెప్పగానే నమ్మి సినిమా చేస్తున్నామని గట్టిగా చెప్పిన మా ఆడబిడ్డ తబిత గారికి థ్యాంక్స్. నమ్మితేనే ఎవరైనా పైకి వస్తారు' అన్నారు. ప్రొడ్యూసర్ తబిత సుకుమార్ మాట్లాడుతూ 'నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. పక్కా తెలంగాణ అమ్మాయిని. డైరెక్టర్ వంశీ ఈ కథ చెబుతున్నప్పుడు మేము చిన్నప్పుడు విన్న విషయాలు, పెద్ద వాళ్లు ఎలా హ్యాండిల్ చేసేవాళ్లు.. అవన్నీ గుర్తొచ్చాయి. నేను ఈ కథ విన్నప్పుడు సుకుమార్‌తో చెప్పాను. మీరు ఈ కథకు కనెక్ట్ అవుతున్నారో లేదోగానీ నేను తెలంగాణ అమ్మాయిని కాబట్టి చాలా కనెక్ట్ అయ్యాను. మనం ఎలాగైనా సుకుమార్ రైటింగ్స్‌లో ఈ సినిమా చేయాలని' అన్నారు. ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'చాలా మంచి కథతో ఈ సినిమా చేస్తున్నాం. సబ్ టైటిల్స్‌తో బిహార్‌లో వేసినా అక్కడ ప్రేక్షకులు కూడా చూసే చిత్రమిది. మన అందరి ఇళ్లలో ఒక కామన్ ప్రాబ్లమ్ ఉంటుంది. ఈ సినిమా రిలీజ్ అయ్యాక అమ్మాయి అయితే వాళ్ల అత్తామామను తీసుకుని థియేటర్‌కు వెళ్లండి' అన్నారు, హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ 'యూట్యూబ్‌లో నా పాటలు చూసి విని ఉంటారు. ఇప్పుడు "ఇడుపు కాయితం" అనే అద్భుతమైన మూవీతో మీ ముందుకు హీరోయిన్‌గా వస్తున్నాను' అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఈ రోజు "ఇడుపు కాయితం" లాంఛింగ్ ఈవెంట్ చూస్తుంటే హ్యాపీగా ఉంది.మీరు నాపై చూపించిన ప్రేమను ఈ సినిమా ద్వారా తిరిగి మీకు అందించబోతున్నా. ఈ సందర్భంగా సుకుమార్‌కి, బన్నీ వాస్‌కి, తబితకి థ్యాంక్స్ చెబుతున్నా' అన్నారు.

# ఘనంగా NBK 112 ప్రారంభం




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ కలయికలో రాబోతున్న చిత్రంపై ప్రకటన వచ్చినప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. SLV సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం, అమరావతిలో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపి మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీ ప్రముఖులు సురేష్ బాబు, గోపీచంద్ మలినేని, వెంకట సతీష్ కిలారు, సాహు గారపాటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. కందుల దుర్గేష్ కెమెరాను స్విచ్ ఆన్ చేయగా, నారా లోకేష్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కుమార్తె నందమూరి తేజస్విని ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రారంభోత్సవానికి సంబంధించిన మొదటి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగమయ్యే అవకాశాన్ని కల్పించినందుకు మా మామగారు బాలకృష్ణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ.. 'బాలకృష్ణ గారి కోసం ఒక సినిమాను రాసి, దర్శకత్వం వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. 'కోట్లాది మంది అభిమానుల ప్రేమను, ఆప్యాయతను పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్‌కి, అలాగే ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించిన తేజస్వినికి నా హృదయపూర్వక ధన్యవాదాలు'అన్నారు.

# 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్ ఆవిష్కరణ



దినేష్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా'. సతీష్ ఆవాల దర్శకత్వంలో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాలో మురళీధర్ గౌడ్, సుధ కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుత సమాజంలో డబ్బు చుట్టూ తిరుగుతున్న మానవ సంబంధాలు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృద్యంగా ఆవిష్కరించిన కుటుంబ కథా చిత్రమిది. ఈటీవీ ప్రభాకర్ మాట్లాడుతూ... "ఈ సినిమా టీజర్, పాటల ఆవిష్కరణ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ముత్యాల సుబ్బయ్య చిత్రాలను గుర్తు చేసే గొప్ప కథ ఇది. చాలా కాలం తర్వాత ఇలాంటి కథ వినడంతో మా అమ్మాయి దివిజను ఈ సినిమా చేయమని ప్రోత్సహించాను' అన్నారు. నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ... "ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తెప్పించే సినిమా ఇది. చాలా కాలంగా చేయాలనుకున్న తరహా పాత్ర ఈ సినిమాలో దక్కింది' అన్నారు. దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ..."మన దేశ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం గొప్ప సంప్రదాయం. కుటుంబాల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ సినిమా చూపిస్తుంది' అన్నారు. నిర్మాతలు కోమలి, మహేందర్ తొట్టె మాట్లాడుతూ... "హనుమాన్ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో, మా సినిమా కూడా అంతటి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటు న్నానము' అన్నారు. హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ... 'జయమ్మ పంచాయితీ' తర్వాత చేసిన మంచిసినిమా ఇది. అన్ని వర్గాల ప్రేక్షకు లను ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉన్నాయి" అన్నారు. హీరోయిన్ దివిజ ప్రభాకర్ మాట్లాడుతూ..."అందరికీ నచ్చే కథ ఇది. ప్రతి ఒక్కరూ ఎంతో మనసుపెట్టి పని చేశారు' అన్నారు. నిర్మాత కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారు. జూలై 18న ప్రేక్షకులంతా థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

# 'సూపర్ సుబ్బు' ట్రైలర్ లాంచ్




ప్రముఖ ఒటిటి నెట్‌ఫ్లిక్స్ తన తొలి తెలుగు ఒరిజినల్ కామెడీ సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను విడుదల చేసింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు చిల్లుకూరి రావు అనే టీచర్ పాత్రలో సందీప్ కిషన్ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ..'సూపర్ సుబ్బు సాధారణంగా ప్రజలు మాట్లాడ టానికి సంకోచించే అంశాన్ని హాస్యం, హృదయానికి హత్తుకునే భావోద్వేగా లతో చెప్పే ప్రయత్నం. సుబ్బు ఒక సమస్యను పరిష్కరించాలనుకుని చివరికి మరిన్ని సమస్యల్లో చిక్కుకుంటాడు'అన్నారు. మిథిలాపాల్కర్ మాట్లాడుతూ.. 'హాస్యంతో పాటు మానవ సంబంధాలు, అంగీకారం, పరస్పర అవగాహన వంటి అంశాలను ఎంతో అందంగా చెప్పిన కథ ఇది. మల్లిక్ రామ్ క్రియేట్ చేసిన మాకిపూర్ ప్రపంచం జీవంతో నిండిపోయి ఉంటుంది' అన్నారు. సుబ్బు తండ్రి కుకటేశ్వరరావుపాత్రలో నటించిన మురళీ శర్మ మాట్లాడుతూ.. ప్రేక్షకులను నవ్విస్తూనే సాధారణంగా దూరంగాపెట్టే కొన్ని అంశాలపై చర్చకు దారి తీసే కథ ఇది' అన్నారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ రచించిన ఈసిరీస్‌ను చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్‌చిలక, భరత్ లక్షీ ౖ పతి నిర్మించారు.సూపర్‌సుబ్బు జూలై2నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో

26-6Pg8exHMNWJQE:26-6Pg8exHMNWJQE.qxd 6/25/2026 11:42 PM Page 1



## తూనికల కొలతల లైసెన్స్ నిబంధనలకు సవరణ

**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లీగల్ మెట్రాలజీ రూల్స్–2011కు సవరణలు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తయారీదారులు, డీలర్ల లైసెన్స్ జారీకి ఆటో అప్రూవల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కొత్తగా లైసెన్స్ కోసం నిర్ణీత ఫీజు చెల్లించి డాక్యుమెంట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే లైసెన్స్ మంజూరవుతుంది. తయారీదారులకు రూ.10వేలు, రిపేర్ చేసేవారికి రూ.5వేలు, డీలర్లకు రూ.2వేలు ఫీజుగా నిర్ణయించినట్లు ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ

## స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి



**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రెండేళ్ళు పోస్టింగ్ లేకుండా ఉన్నా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యర్రా శ్రీలక్ష్మిని ఏపీ ప్రభుత్వం కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన (జీఏడీ అండ్ ఏఆర్) శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆమెను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి వై. శ్రీలక్ష్మికి ఎట్టకేలకు ప్రభుత్వం ఈ కీలక పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారిక జీవోను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ బాధ్యతలను అదనపు ఇన్‌ఛార్జిగా నిర్వహిస్తున్న ముకేష్ కుమార్ సింగ్ రావత్ నుంచి వై.శ్రీలక్ష్మికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సాధారణ పరిపాలన శాఖలో కీలక పరిపాలనా బాధ్యతలు ఇకపై ఆమె పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. వై.శ్రీలక్ష్మి సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారిణిగా గుర్తింపు పొందారు. ఆమెకు కీలక శాఖల్లో పనిచేసిన అనుభవం ఉంది. తాజాగా ప్రభుత్వం ఆమెకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొంది.

## ఎప్‌సెట్ రాసిన సిబిఎస్ఇ విద్యార్థులకు అలెర్ట్

**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ఈఏపీసెట్‌కు హాజరై, సీబీఎస్ఈ 12 వతరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ముఖ్య గమనిక. ఈ విద్యార్థులందరికోసం ఏపీ ఎప్‌సెట్ కన్వీనర్ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. సీబీఎస్ఈ రివెరిఫికేషన్ రీ వాల్యుయేషన్ అనంతరం విడుదలైన సవరించిన ఫలితాల్లో మార్కులు పెరిగిన అభ్యర్థులు తప్పనిసరిగా సీబీఎస్ఈ రీ వాల్యుయేషన్ డిక్లరేషన్ ఫారమ్ పేర్చి చేయాలని సూచించింది. తమ వెబ్‌సైట్ లింక్ ద్వారా డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత అభ్యర్థులు డిక్లరేషన్ ఫారాన్ని 2026–జూన్ 27న సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు సూచించారు. మరోవైపు రాష్ట్రంలో లక్షలది మంది విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాలు విడుదల కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1 నాటికే ఎప్‌సెట్ రిజల్ట్స్ వెల్లడి కావాల్సి ఉండగా ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు మార్కులు పెంచుకొనేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాసే అవకాశం కల్పించడం, ఆ తర్వాత సీబీఎస్ఈ రీవాల్యుయేషన్ వ్యవహారం నేపథ్యంలో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ఎప్‌సెట్ ఫలితాలను అధికారులు విడుదల చేయలేదు. తాజాగా సీబీఎస్ఇ 12వ తరగతి రీవాల్యుయేషన్ రీవెరిఫికేషన్ పలితాలు విడుదలవ్వడంతో ఈ డిక్లరేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం సత్వరమే ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

# ఎల్‌నినో ఎఫెక్ట్

### దెబ్బతిన్న కూరగాయల సాగు

### తీవ్రంగా పడిపోయిన దిగుబడి

### మార్కెట్లలో భగ్గుమంటున్న ధరలు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ఎల్‌నినో ఎఫెక్ట్‌తో తెలంగాణలో కూరగాయల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా జూన్ నెలలో కురవాల్సిన వర్షాలు ఈసారి జాడ లేకపోవడంతో కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతిని కూరగాయల దిగుబడి గణనీయంగా పడిపోయింది. బోర్ నీళ్లనే వర్షం మాదిరిగా స్ప్రే చేస్తూ పంటలను బతికించే ప్రయత్నం చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. చిక్కుడు, టమాటా, బీన్స్, క్యాబేజీ లాంటి కూరగాయల ఉత్పత్తి తగ్గిపోయింది. వర్షాభావంతో చిక్కుడు పంటలు ఎండిపోతుండగా, టమాటా దిగుబడి కూడా పూర్తిగా పడిపోయింది. ఎల్‌నినో పరిస్థితులు వస్తాయని ఆరు నెలల కిందటే హెచ్చరికలు వచ్చాయని, అందుకే పంటల మార్పిడిపై దృష్టి పెట్టామని రైతులు చెబుతున్నారు. వేసిన కూరగాయల తోటలు సైతం మొలకెత్తే పరిస్థితి లేదంటున్నారు. ఒకప్పుడు తెలంగాణలో 5 లక్షల 52 వేల ఎకరాల్లో పండిన కూరగాయలు ఇప్పుడు 50 వేల ఎకరాలకు పడిపోయింది. కాగా ఎల్‌నినో పరిస్థితులతో దిగుబడి తగ్గడంతో పాటు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గి కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. రాబోయే రెండు మూడు నెలల్లో కూరగాయల ధరలు మరింత భగ్గుమనే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు బజార్లలో సరుకు లేకపోవడంతో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 మధ్య ఉన్న టమాటా, ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వస్తే తప్ప హైదరాబాద్ మార్కెట్‌లో దొరకని పరిస్థితి ఏర్పడింది. బీన్స్ రైతు బజార్లోనే కిలో రూ.100 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.150 నుంచి రూ.180 వరకు అమ్ముడవుతోంది. చిక్కుడుకాయ కూడా రైతు బజార్లో రూ.70 నుంచి రూ.80 ఉండగా, బయట మార్కెట్‌లో రూ.150 వరకూ పలుకుతోంది. హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు ఒకప్పుడు హార్టికల్చర్‌కు కేంద్రంగా ఉండేవి. కానీ రియల్ ఎస్టేట్ విస్తరణతో కూరగాయల సాగు క్రమంగా తగ్గిపోయింది. మొత్తంగా ప్రస్తుతం రాష్ట్రంలో నీటి కొరత, పెరిగిన సాగు ఖర్చులు, తగ్గిన దిగుబడి అంతా కలిపి కూరగాయల భోజనం చేయాలంటే సామాన్యుడి జేబు ఖాళీ అవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.

### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు..

# హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది. కాగా, ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో స్పీకర్‌ను పార్టీ చేయవద్దని కోరుతూ స్పీకర్ కార్యాలయం త్వరలో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయనుంది. దీనికి సంబంధించి సుప్రీం కోర్టు జడ్జిమెంట్లను అందజేయనుంది.

# మాదకద్రవ్యాల వ్యసనం... సామాజిక సమస్య మాత్రమే కాదు

# దేశ భవిష్యత్తుకు తీవ్రముప్పు

### • రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత




**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదని,దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని ఏపీ అంతరంగిక శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇది యువతలోని ప్రతిభ, ఆరోగ్యం ఆశయాలను నాశనం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని, విఐటి ఏపీ విశ్వవిద్యాలయంలో ఈగల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, యువత సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతరంగిక విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు అధికారులు, ఇతర ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి వంగలపూడి అనిత యువతను మాదకద్రవ్యాల వ్యసనం అనే ప్రమాదం నుండి రక్షించాల్సిన అత్యవసరతను గుర్తించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలను ప్రశంసిస్తూ, రాష్ట్రం సాధించిన "జీరో గంజాయి సాగు" విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్రమ గంజాయి సాగు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ, ముఖ్యంగా ఈగల్ బృందాలు నిరంతరం చేస్తున్న కృషిని ఆమె అభినందించారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగ చరిత్రను ప్రస్తావిస్తూ, 1980ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య వేగంగా విస్తరించిందని, అప్పటి నుండి సమాజాలకు పెద్ద సవాలుగా మారిందని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ, అసంప్రదాయ నేర ముఠాలు యువతను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను మాత్రమే కాకుండా దేశ భద్రత, అభివృద్ధిని కూడా దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటిగా, గత మూడు నుండి నాలుగు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాలు మరియు ఆంధ్ర– ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో సాగవుతున్న అక్రమ గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. దీనిని చారిత్రాత్మక విజయంగా అభివర్ణిస్తూ, ఈ ఘనతకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఈగల్ బృందాల అంకితభావమే కారణమని కొనియాడారు. ఈ సందర్భంగా ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, ఐపీఎస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో జీరో గంజాయి సాగు సాధన నిరంతర అమలు చర్యలు, నిఘా ఆధారిత ఆపరేషన్లు, ప్రజల భాగస్వామ్య ఫలితం. మా లక్ష్యం కేవలం చట్ట అమలు మాత్రమే కాదు; యువత జీవితాలను రక్షించడం, సమాజంలో అవగాహన పెంపొందించడం, భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల ముప్పు నుండి కాపాడడం కూడా అని తెలియచేసారు.

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలపై పోరాటంపై విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని, అవగాహన, అప్రమత్తతే యువత భవిష్యత్తును రక్షించే అత్యంత శక్తివంతమైన ఆయుధాలని పేర్కొన్నారు.

ఈగల్ సెల్ ఎస్పీ నాగేశ్ బాబు కార్యక్రమంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం, యువతలో ఆరోగ్యకర, బాధ్యతాయుత జీవనశైలిని ప్రోత్సహించేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# రాజ్యసభ ఎంపిల ఆస్తుల విలువ రూ.26,047 కోట్లు

### ఎడిఆర్ అధ్యయన నివేదికలో ఆసక్తికర అంశాలు



**న్యూఢిల్లీ, జూన్ 25:** రాజ్యసభ సభ్యుల ఆర్థిక, నేర చరిత్రపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదికలో పలు కీలక, ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని పెద్దల సభలో అత్యధిక సంపన్నులతో పాటు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. మొత్తం 233 మంది సభ్యులకు గాను 226 మంది సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ విశ్లేషణ జరిగింది. నివేదిక ప్రకారం ఈ 226 మంది ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.26,047 కోట్లుగా ఉంది. సగటున ఒక్కో ఎంపీ ఆస్తి రూ.115 కోట్లకు పైగా ఉండటం గమనార్హం. వీరిలో 31 మంది ఎంపీలు (14శాతం) రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న బిలియనీర్లుగా ఉన్నారు. మరోవైపు కేవలం నలుగురు ఎంపీలు మాత్రమే తమ ఆస్తుల విలువ రూ.20 లక్షల లోపు ఉన్నట్లు ప్రకటించారు. సుమారు 100 మంది ఎంపీల ఆస్తులు రూ.10 కోట్లకు పైగా ఉండగా, 41 మందికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మధ్య, 66 మందికి రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ఆస్తులున్నాయి. ఆస్తులతో పాటు ఎంపీల నేర చరిత్రను కూడా ఏడీఆర్ విశ్లేషించింది. విశ్లేషించిన వారిలో 69 మంది ఎంపీలపై (31 శాతం) క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 36 మంది ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఒక ఎంపీపై హత్య కేసు (సెక్షన్ 302), మరో నలుగురిపై హత్యాప్రయత్నం (సెక్షన్ 307) కేసులు ఉన్నాయి. ఇంకో నలుగురు ఎంపీలపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.

పార్టీల వారీగా చూస్తే బీజేపీకి చెందిన 107 మంది ఎంపీలలో 28 మందిపైనా, కాంగ్రెస్‌కు చెందిన 29 మందిలో 12 మందిపైబా క్రిమినల్ కేసులు ఉన్నాయి. టీడీపీకి చెందిన నలుగురిలో ముగ్గురిపై, బీఆర్ఎస్ కి చెందిన ముగ్గురు ఎంపీలపైనా కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ 9 మందిలోఇద్దరు, డీఎంకే 8 మందిలోఇద్దరు, సమాజ్‌వాదీ పార్టీ నలుగురిలో ఇద్దరు, సీపీఎం ముగ్గురులో ఒకరు, ఆర్జేడీ ముగ్గురిలో ఇద్దరు చొప్పున క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎంపీలు ఉన్నారు. రాష్ట్రాల వారీగా సంపద కేంద్రీకరణలో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. రాష్ట్రానికి చెందిన ఏడుగురు ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.8,310 కోట్లు కాగా, వారిలో నలుగురు బిలియనీర్లు ఉన్నారు. వ్యక్తిగతంగా చూస్తే, బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ.5,300 కోట్లకు పైగా ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న రాజ్యసభ సభ్యుడిగా నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజిందర్ గుప్తా (రూ.5,053 కోట్లు), కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ (రూ.2,558 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు ఆప్ ఎంపీ సంత్ బల్బీర్ సింగ్ కేవలం రూ.3.79 లక్షల ఆస్తితో జాబితాలో అట్టడుగున ఉన్నారు. కొంతమంది ఎంపీలకు ఆస్తులతో పాటు భారీగా అప్పులు కూడా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. జార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్ నత్వానీకి రూ.755 కోట్ల ఆస్తులుండగా, అత్యధికంగా రూ.256 కోట్ల అప్పులు ఉన్నాయి. ఏపీ చెందిన టీడీపీ ఎంపీ బి. రామకృష్ణ రూ.672 కోట్ల ఆస్తులు, రూ.200 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్‌కు రూ.1,578 కోట్ల ఆస్తులు, రూ.149 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు.

# రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వివరాలపై వివాదం

### సిట్ దర్యాప్తు పూర్తయ్యే వరకూ వివరాలివ్వలేం

### అయోధ్య విరాళాలపై ట్రస్ట్ వెల్లడి



**అయోధ్య, జూన్ 25:** అయోధ్యలోని రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై వివాదం కొనసాగు తోంది. ట్రస్ట్‌కు వచ్చిన విరాళాలు, భూముల కొనుగోలు వివరాలను బహిరంగ పరచాలని కోరుతూ సీనియర్ బీజేపీ నేత రజ్నీష్ సింగ్ ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పీఎంఓ సంబంధిత అంశంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర, జిల్లా స్థాయి యంత్రాంగాన్ని ఆదేశించింది. జిల్లా యంత్రాంగం ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించి అవసరమైన ఆర్థిక వివరాలు అందించాలని కోరింది. అయితే ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగు తున్నందున ఆ వివరాలను వెల్లడించడం సాధ్యం కాదని ట్రస్ట్ స్పష్టం చేసింది. విచారణ పూర్తయ్యే వరకు సమాచారం బహిరంగపరచడం సరైంది కాదని ట్రస్ట్ అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, ట్రస్ట్‌లో నగదు లెక్కింపు పనుల్లో పాల్గొన్న కొందరు ఉద్యోగులు దర్యాప్తు సంస్థల నిఘాలో ఉన్నట్లు సమాచారం. కొందరి నివాసాల్లో నగదు స్వాధీనం చేసుకున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. అదేవిధంగా, రామ్ మందిరానికి బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చిన కొందరు భక్తులు తమకు ఇప్పటివరకు అధికారిక రసీదులు అందలేదని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు, కొందరు మత గురువులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఆరోపణలపై తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపిస్తున్నారు. రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై జరుగు తున్న సిట్ విచారణ పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ, మత వర్గాలు భావిస్తున్నాయి.

**పిల్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు**

అయోధ్య రామాలయంలో నిధులను దుర్వినియోగం చేశారని, ఆ ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఓ పిటీషనర్ ఇవాళ ఆశ్రయించాడు. ఈనెల 29వ తేదీన సోమవారం కోర్టుకు వచ్చి పిల్‌ను దాఖలు చేసుకోవాలని ఆ పిటీషనర్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నిధుల దుర్వినియోగం అంశంపై దర్యాప్తునకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయాలని, నిర్దేశిత సమయంలోగా నిధులపై దర్యాప్తును పూర్తి చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ప్రస్తుతం అయోధ్య నిధులపై దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. అడ్వకేట్లు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్‌లు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కోట్లాది భక్తుల, దాతల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజాప్రయోజనాల రక్షణ కోసం నిధుల నిర్వహణ అంశంలో ఓ రెగ్యులేటరీ వ్యవస్థను తయారు చేయాలని కోరుతూ కేంద్రం, యూపీ సర్కారు, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు ఆదేశాలు ఇవ్వాలని ఆ పిటీషన్‌లో కోరారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ తో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు విన్నది. లిస్టింగ్ కోసం సోమవారం పిల్ దాఖలు చేయాలని కోర్టు సూచించింది.

# హ్యామ్‌రోడ్లతో తెలంగాణ మహర్దశ

### సిఎం రేవంత్‌రెడ్డిచే 28న హ్యామ్‌రోడ్ పైలాన్ ఆవిష్కరణ

### ఆర్‌అండ్‌బి 419 రోడ్లకు రూ. 13వేల కోట్లు

### 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,450 కిమీ పిఆర్ రోడ్లు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** తెలంగాణకు హైబ్రిడ్ అన్యూటిమోడ్ విధానంతో 12వేల కి.మీ. ఆర్‌అండ్‌బి, 7,450 కి.మి పంచాయితీరాజ్ రోడ్లను నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ చేసే ప్రక్రియ ఆరంభిస్తుండటంతో రవాణా రంగంలో రాబోతున్న గణీయమైన మార్పుతో రాష్ట్రంకు మహర్ధశ పట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 28న ఆర్ అండ్ బి 13వేల కోట్లతో నిర్మించి అభివృద్ధి నిర్వహణ చేసే హ్యామ్‌రోడ్ల పైలాన్ నల్లగొండ జిల్లా కనగల్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆవిష్కరిస్తారు. తెలంగాణలో ఆర్ అండ్‌బి ఆధ్వర్యంలో నిర్మించబోయే 5824.27కిమి నిడివి కలిగిన 419 రోడ్లకు లాంఛనంగా శంకుస్థాన చేయ బోతు న్నారు. హ్యామ్ పద్దతిలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచి ర్యాల, నల్లగొండ, నిజామాబాద్,సంగారెడ్డి సిద్ది పేట, వనపర్తి, యాదగిరి భువనగిరి జిల్లాలో రోడ్లను అభివృద్ధి పరచాలని దృష్టి సారించింది. హ్యామ్ విధా నంలో 40శాతం వ్యయం రాష్ట్రప్రభుత్వం భరించగా 60శాతం కమిషనీయర్ పెట్టుబడిపెడుతారు . నిర్మాణ సమయంలో ప్రభుత్వం నలుబైశాతంను పది సమాన వాయిదాల్లో నిర్మాణ వ్యయం అందిస్తోంది. ఈ 60శాతంను 15సంవత్సరాలలో 30 వాయిదాల్లో తిరిగి చెల్లిస్తుంది. రోడ్ల నిర్వహణ బాధ్యత పెట్టుబడిదారుడికే ఉంటుంది. మొదటి దశలో 32 ప్యాకేజిలలో పనులు చేయబోతున్నారు.

ఆర్‌అండ్‌బి తరహాలోనే 96 అసెంబ్లీ నియోజకవర్గాలలో 7450 కిమి పల్లెగ్రామీణ రహదా రులను కూడా నిర్మించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్‌బి, పిఆర్‌కు చెందఇన కీలకమైన గామీణరోడ్లు, రాష్ట్రరోడ్లు, ప్రధానమార్గలను అద్దంలా నున్నగా అన్నికాలకు అనువైన రోడ్లుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో హ్యామ్ రోడ్ల విధానంకు ప్రభుత్వం మొగ్గు చూపింది.హైబ్రిడ్ అన్యూటీ మోడ్ విషయంలో కాంట్రాక్టర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపడంలేదు దీనితో కాంట్రాక్టు ఒప్పొందాలు చేసుకోవడం ఆలస్యం అవుతోన్నది. సిఎం పర్యటన సందర్భంగా అర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఆదివారం హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని మొదటగా మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన "హ్యామ్" రోడ్ల పైలాన్ ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేస్తారు సిఎం ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరవుతారు.

# నాగోల్ ఎస్‌టిపిని సందర్శించిన కేంద్ర మంత్రి సాహు



నాగోల్ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శిస్తున్న కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి టోకెన్ సాహు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు హైదరాబాద్‌లోని 320 ఎంఎల్‌డీ నాగోల్ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్‌టీపీ) సందర్శించారు. మంత్రితో పాటు జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, సీఏజీఎం పద్మజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనితీరు, మురుగునీటి శుద్ధి ప్రక్రియ, నిర్వహణ విధానాలు, ఎస్‌బీఆర్‌లు, స్కాడా వ్యవస్థ తదితర విభాగాలను పరిశీలించిన మంత్రి, పర్యావరణ ప్రమాణాల అమలు, వ్యర్థ జలాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం నిర్వహణ సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సమర్థవంతమైన మురుగునీటి శుద్ధి, ఉద్యోగుల భద్రతకు జలమండలి ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా మంత్రి టోకెన్ సాహుకు అధికారులు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చంచల్‌గూడ జైలు నుండి విడుదల



జైలు నుండి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 25, ప్రభాతవార్త:** వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో అరెస్టయి చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై పెట్టిన కేసులు అన్ని రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలు, కార్మికుల సమస్యలు, బొగ్గు లెక్కలు, డీజిల్ కుంభకోణం, సోలార్ టెండర్ల గురించి ప్రశ్నిస్తున్నందుకే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. సింగరేణిలో ఎలాంటి అక్రమాలు జరుగకపోతే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని, 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుకు సంబంధించిన రూ1500 కోట్ల కుంభకోణంపై వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బొగ్గు మాయం కాకుంటే ప్రజలకు లెక్కలు చూపించి, బయటపెట్టాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

డీజిల్ కొనుగోళ్లు, వినియోగంలోని అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయని, సోలార్ టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందనే అనుమానాలు ఉన్నాయని, వీటికి సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం ద్వారా అసలు విషయాన్ని మరుగున పడేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు.

# తిరుపతి జిల్లా విద్యాశాఖ సంచలనం...





## ప్రభుత్వ బడుల్లో రికార్డు స్థాయి అడ్మిషన్లు ! బడి పిలుస్తోంది రథానికి దక్కిన గ్రాండ్ సక్సెస్ ఒకటో తరగతి ప్రవేశాల్లో 96.60 శాతం నమోదు కార్యాలయం వీడి.. జనం బాట పట్టిన డి ఈ ఓ ప్రైవేట్,కార్పొరేట్ శక్తులకు దీటుగా పెరిగిన ప్రభుత్వ పాఠశాలల విశ్వసనీయత

**తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాత వార్త**

తిరుపతి జిల్లా విద్యాశాఖ సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల హవా నడుస్తున్న నేటి రోజుల్లో, వాటిని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం ఎంతలా పెరిగిందో చెప్పడానికి ప్రస్తుత ఒకటో తరగతి అడ్మిషన్ల గణాంకాలే నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి ప్రవేశాల్లో ఏకంగా 96.60 శాతం నమోదు సాధించి, తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే అగ్రపథంలో నిలిచింది.

**36 మండలాలు 36 రోజులు.. తిరగబడిన విద్యా చిత్రం !**

కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ అత్యంత వినూత్నంగా ముందుకు తీసుకెళ్లారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, 36 మండలాలు 36 రోజులు ఇంటింటికీ ప్రచార రథం పేరిట ఒక క్షేత్రస్థాయి సమరాన్ని లాంచ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓస్), ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఒక సైన్యంగా కదిలించి, ప్రతి ఇంటి తలుపూ తట్టారు. దీనికి తోడు స్థానిక ప్రజాప్రతినిధులను, శాసనసభ్యులను ఈ ప్రచారంలో భాగస్వామ్యం చేయడం వల్ల ఈ కార్యక్రమానికి తిరుగులేని ప్రజాదరణ లభించింది.

**మైక్ పట్టి రోడ్డు ఎక్కిన డి ఈ ఓ .. ఆకట్టుకున్న రండిరా... రండిరా... నినాదం**

ఈ మహా యజ్ఞంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ ప్రదర్శించిన అంకితభావం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఆయనే రహదారుల కూడళ్లలో ఉపాధ్యాయులతో కలిసి మానవహారాలు నిర్వహించారు. స్వయంగా చేతిలోకి మైక్ తీసుకుని రండిరా... రండిరా... ప్రభుత్వ బడికి రండిరా అంటూ వీధి వీధినా పిలుపునిచ్చారు.ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య,కార్పొరేట్ స్థాయి మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూములు,ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు,పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనంవంటి అంశాలను ఆయన ప్రజలకు వివరించిన తీరు తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. లక్ష్యానికి అత్యంత చేరువలో...జిల్లాలో ఒకటో తరగతిలో 13,562 మంది విద్యార్థులను చేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా.. విద్యాశాఖ యంత్రాంగం పట్టుదలతో ఇప్పటివరకు 13,197 మందిని (96.60 శాతం) ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించింది. ఇది రాష్ట్రంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ రికార్డ్ అని విద్యాశాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**మూతపడిన బడులకు మళ్లీ జీవం!**

జిల్లాలో ఐదేళ్లు నిండిన ప్రతి చిన్నారి బడిలో ఉండాలనే లక్ష్యంతో 24,658 మంది పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించారు. ఈ వినూత్న ప్రచారం వల్ల గతంలో విద్యార్థులు లేక మూతపడిపోయిన కొన్ని పాఠశాలలు కూడా ఈ బడి పిలుస్తోంది దెబ్బకు మళ్లీ తెరుచుకోవడం ఒక విశేషం. పదో తరగతిలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానికంగా సన్మానించడం, ఊరూరా సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా ర్యాలీలు నిర్వహించడం ద్వారా విద్యా వాతావరణాన్ని గ్రామాల దాకా తీసుకెళ్లారు.

**టీమ్ వర్క్ అండ్ లోకేష్ సంస్కరణల కలయిక**

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవడంలో డి ఈ ఓ వంద శాతం సఫలీకృతులయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ.. ఊరూరా సాంస్కృతిక ప్రదర్శనలు, టాపర్లకు సన్మానాలతో విద్యా పండుగ వాతావరణాన్ని సృష్టించారు.అధికారి అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు.. తానే ముందుండి నడిపించాలని నిరూపించారు కె.వి.ఎన్. కుమార్ .ప్రస్తుతం తిరుపతి జిల్లా సాధించిన ఈ ఘన విజయం మరియు డి ఈ ఓ అంకితభావం మిగతా జిల్లాల అధికారులకు రోల్ మోడల్గా నిలుస్తోంది. విద్యాశాఖలో నిజమైన సంచలనం సృష్టించిన డి ఈ ఓ కుమార్ పై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి అభినందనల వర్షం కురుస్తోంది.

# యదేచ్ఛగా సహజ వనరుల దోపిడీ...!!



## ఇదీ సత్యవేడు నియోజకవర్గంలో పరిస్థితి

సత్యవేడు, జూన్ 25 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గం అధ్యక్ష...మీకు బాగా పరిచయమై...మీ మాటే శిరోధార్యంగా వ్యవహరించే సత్యవేడు నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదని చెప్పాలి. ప్రధానంగా తమిళనాడుకు సమీపంలో ఉండడమే శాపంగా మారింది. నిత్యం లక్షలాది టన్నుల్లో కంకర, గ్రావెల్ అక్రమ లెక్కల్లో తరలిపోతోంది. ఇక చిన్న చిన్న రహదారుల పరిస్థితి ఇబ్బందిగా మారిపోయింది. దాదాపు 23 గ్రామాలకు పైగా ఈ మట్టి గ్రావెల్ మాఫియాకు బలైపోనట్లు అంచనా. అభివృద్ధికి అన్ని అవకాశాలు ఉన్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎవరో ఒకరు రావడం, మరిన్ని క్వారీలకు అనుమతులు ఇవ్వడం, దోపిడీ యథాతదం. సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఇక్కడ విలువే లేదు అన్నది మీకు తెలిసిన నగ్న సత్యం పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక ఎన్నికల్లో పరిస్థితులు తారుమారు అయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యలను మీరు ప్రత్యేక దృష్టితో పరిష్కరించ కలిగితే కుప్పం తరువాత సత్యవేడు అన్ని విధాల ముందు ఉంటుందని మా మనవి. ఇక్కడ నియోజకవర్గ పునర్విభజన జరగాల్సిందే. తద్వారా జరిగే ప్రగతి మీకు తెలిసిందే. భూ వివాదాలు ప్రభుత్వ భూముల కబ్జాలు పంట కాలువ కబ్జాలు...రుద్ర భూములకు రహదారి సౌకర్యాలు లేక ఇబ్బందులు పేదల ఇళ్ళ స్థలాలు అక్రమణలు వంటి సమస్యలతో తల్లడిల్లి పోతున్న సత్యవేడుకు రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాల్సిందే. ఎన్నికల్లో మీరిచ్చిన తొలి హామీ ఇదే. మరచిపోవద్దు బాబు గారు...ఈ హామీ నెరవేరకపోతే పెద్ద నింద మీ మీద పడుతుందని మా ఆవేదన. దాసుకుప్పం, వరదయ్యపాళెం, సత్యవేడుకు బైపాస్ రోడ్ల నిర్మాణాలు కాగితాల దశ దాటలేదు. మీరు చొరవ చూపాలి. న ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ సాయంత్రం 6 దాటితే రాకపోకలు బంద్ డిపో ప్రగతి బస్టాండ్ అభివృద్ధి పట్టించుకునే దిక్కే లేదు. న సత్యవేడుతో పాటు సమీప 24 గ్రామాలకు దాహార్తిని తీర్చే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు(పెద్ద చెరువు నిర్మాణం) లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల పాడుబడ్డ భవనాలతో పేద విద్యార్థుల అవస్థలతో చదువులు సాగిస్తున్నారు. కనీసం విద్యార్థులు కూర్చోవడానికి సరైన డెస్కులు కూడా లేని దుస్థితి. ఈ సమస్యల పరిష్కారం పై వినతులు జోరుగా వెళ్లినప్పటికీ పరిష్కారం మాత్రం ఐదేళ్లుగా శూన్యం.. కనికరం చూపండి బాబు కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తరువాత నియోజకవర్గ స్థాయిలో జిల్లా పరిపాలనాధికారి అధ్యక్షతన ఒకే ఒక్క సమీప సమావేశం జరగలేదంటే ఇక్కడ పాలన ఎలా జరుగుతుందో మీరు అవగతం చేసుకుని తీరాల్సిందే. న పార్టీ విషయానికొస్తే ఏడు మండలాల్లో మండల పార్టీ అధ్యక్షులు ఎన్నికల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. ఇందులో రెండు మండలాల్లో కో-ఆర్డినేటర్ వ్యతిరేకంగా ఐదు మండలాలు అనుకూలంగా నియమించారు. అయితే అనంత కాలానికే పరిస్థితి. నా అనుకున్నవారే ఎదురు తిరగడం పార్టీలో తీవ్ర చర్చ జరుగుతుంది. అయితే కో-ఆర్డినేటర్, రక్త సంబంధికాలతో ఈ సత్యవేడు నియోజకవర్గంలో 29 క్వారీలు, ఇసుక, కంకర, మట్టి ద్వారా రోజుకు మూడులక్షలు వసూలు చేస్తున్నారని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుని పోయినట్లు కొంత మంది మండల అధ్యక్షులు బహిరంగ పేర్కొంటున్నారు. మొత్తానికి అధిష్టానం ద్వారా ఏ నిర్ణయం జరుగుతుందని, అధిష్టానం ఇక్కడ ఎలా ఉందో సమన్వయం మీకు తెలియాల్సిందే. ఏకంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఓ సీనియర్ నేత చేసిన ఘాటు విమర్శ అందరిని ఆత్మ శోధన లోకి నెట్టేసింది. గత ఏడాదిరన్నర కాలంగా వైసీపీ శ్రేణులకే పనులు బాగా జరుగుతున్నాయని, పసుపు జెండాల నేతలు కార్యకర్తలు ఇచ్చే ఏ ఒక్క వినతికి సరైన పరిష్కారం దొరకలేదని ఆ నేత పేర్కొన్నారు. అంటే ఏడు మండలాల్లో పాలన ఎలా జరుగుతుందో మీరు గుర్తించండి ఒక్కసారి.





అప్పలాయిగుంటలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పెద్దశేష వాహనంపై శ్రీవారు, తిరుచ్చి వాహనసేవ

# ప్రాణం ఉన్నంత కాలం టీడీపీలోనే కొనసాగుతాం

## - ఎమ్మెల్యే ఆదిమూలం



**సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త:**

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తాను జీవించి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. వైసీపీలో చేరే ప్రసక్తే లేదని, టీడీపీని వీడే ఆలోచనే లేదని తెలిపారు. తాను ఎప్పుడూ టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయలేదని, గతంలోకాని, ప్రస్తుతం కాని వారి మీద ఎలాంటి అక్రమ కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్లపై తనకు అపారమైన విశ్వాసం ఉందని తెలిపారు. ప్రస్తుతం తనపై ఉన్న సస్పెన్షన్ను కూడా పార్టీ అధిష్టానం త్వరలో ఎత్తివేస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తనకు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చినా, ఇవ్వకపోయినా టీడీపీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నన్ను నమ్మి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన చంద్రబాబు, లోకేష్లకు ఎప్పటికీ ద్రోహం చేయనని, నేను ఇప్పటికీ టీడీపీ ఎమ్మెల్యేనని గర్వంగా చెబుతున్నానని ఆదిమూలం పేర్కొన్నారు. తనపై భూ ఆక్రమణలు, అవినీతి ఆరోపణలు ఎవరూ చేయలేదని, ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు కూడా నమోదు కాలేదని తెలిపారు. గ్రావెల్, ఇసుక అక్రమ దోపిడీ, అక్రమ రవాణాను తాను ఎప్పుడూ సమర్థించుకోలేదని, అలాంటి కార్యకలాపాలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదని స్పష్టం చేశారు. చట్ట విరుద్ధమైన చర్యలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు తాను ఎల్లప్పుడూ మద్దతు ఇస్తానని తెలిపారు. ప్రజలసంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, కార్యకర్తల శ్రేయస్సే తన లక్ష్యమని, సత్యవేడు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీడీపీతోనే నా రాజకీయ ప్రస్తాం టీడీపీతోనే నా చివరి శ్వాస వరకు ప్రయాణం అని స్పష్టం చేశారు.

# తిరుపతి డివిజన్

## తూతూ మంత్రంగా మండల సమావేశం

**వడమాలపేట, జూన్ 25 ప్రభాతవార్త:**

వడమాలపేట మండల సర్వసభ్య సమావేశం గురువారం తూతూ మంత్రంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. అయితే ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేక సుమారుగా గంటసేపు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించబడే మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంపై పలువురు విమర్శించారు. సమస్యలపై ప్రశ్నించే వారు లేకపోవడంతో అధికారులు ఒకింత ప్రశాంతంగా ఉండిపోయారు. ఎంపీటీసీలులు గైర్హాజరు, సర్పంచ్ల పదవీ కాలం పూర్తి కావడంతో సమావేశం వెలవెలపోయింది. ఎలాంటి తీర్మానాలు లేకుండానే సమావేశాన్ని అధికారులు మమ అనిపించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిమూలం









**వరదయ్యపాలెం, జూన్ 25 ప్రభాతవార్త**

హీరో కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సీఎం కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. జూలై 1వ తేదీన వరదయ్యపాలెం మండలం వీకేఆర్వై కాలనీ సమీపంలో చెరివి రోడ్డు సత్యవేడు మండలం పరిధిలోని హీరో కంపెనీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపద్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం హీరో కంపెనీకి చేరుకుని సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. 600 కోట్లతో హీరో కంపెనీలో విడిభాగాల విస్తరణ యూనిట్ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపద్యంలో హీరో కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమావేశమై సీఎం పాల్గొననున్న సభా వేదిక, ప్రారంబోత్సవ ఏర్పాట్లుపై చర్చించారు. హీరో కంపెనీ భారతదేశ ప్రధాన నిర్వాహకుడు నిహాల్, స్థానిక కంపెనీ యూనిట్ హెచ్ ఆర్ ప్రధాన నిర్వాహకుడు చక్రవర్తి మనోహర, సెక్యూరిటీ అధికారి కిరణ్ దిలీ పర్యటనలో తీసుకుంటున్న ఏర్పాట్లను ఎమ్మెల్యేకు వివరించారు.. వరదయ్య పాలెం తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, వీఆర్వో నాగేంద్ర పాల్గొన్నారు.

## - వరదయ్యపాలెం నుండి శ్రీకాళహస్తి మార్గం దుస్థితి









**వరదయ్యపాలెం, జూన్ 25 ప్రభాతవార్త:**

గోవర్ధనపురం సొంత వేలూరు క్రాప్ సమీపంలో అదేవిధంగా అవంతి ఫ్యాక్టరీ పోవు మార్గం మొత్తం గుంతల మయంగా మారింది. భారీ వాహనాలు ఆ ఆ రోడ్డు మీద రవాణా చేయాలి. వర్షాకాలం వస్తే పూర్తిగా గుంతలే కనిపించవు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వెలుతున్నప్పుడు వెలువడే బారి దుమ్ము వల్ల ముందు వచ్చే వాహనాలు కనపడక చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు ఆర్ అండ్ బి అధికారులు ఇంత వరకు స్పందించకపోవడం సరైన పద్ధతి కాదు అని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోవర్ధనపురం నుంచి అవంతి ఫ్యాక్టరీ పో మార్గం దాదాపు ఒక కిలోమీటర్ మేరకు పూర్తిగా గుంతల మయంగా ఉంది. మేజర్ పంచాయతీ అయినా వరదయ్యపాలెం పంచాయతీ నిధులతో అయినా అక్కడ రోడ్డు వేయాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం చంద్రబాబు మహాసభ ఏర్పాట్లను పర్యవేక్షించిన టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి, అధికారులు





**ఓబులవారిపల్లి, జూన్ 25 ప్రభాతవార్త**

ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి గురుకుల పాఠశాల ఎదురుగా ఆర్ఆర్ 5 మంగంపేట పునరావాసం గ్రామం పక్కన స్థలాన్ని జూలై నెల రెండవ తేదీ సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేయ సందర్భంగా మహాసభ ప్రాంగణాన్ని కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఎమ్మెల్యే ఆర్వ శ్రీధర్ మరియు తిరుపతి జిల్లా రేణిగుంట డివిజన్ డిఎస్పి శ్రీనివాసరావు. ఆర్డీవో రామ్మోహన్ రావు తదితర జిల్లా యంత్రాంగం అధికారులు సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కింగ్ సభ జరుగు స్టేజ్ వాహనాలు పార్కింగ్ తదితర మ్యాపును పరిశీలించారు ఎక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఎటువంటి అవార్డుని సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు ప్రజల అవసరాలకు ఏర్పాటు ఎటువంటి అసౌకర్యానికి లోను కాకుండా ప్రజలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు అత్యంత సుందరంగా సభా ప్రాంగణాన్ని స్థలాన్ని తయారుచేసి సూపర్ లు పరిచే విధంగా 24 గంటలు లోపు యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి సారథ్యంలో సభ స్థల ప్రాంగణాన్ని అత్యంత వైభవంగా సుందరంగా తీర్చిదిద్దడం ఆశ్చర్యానికి గురవుతుందని పలువురు కూటమి నాయకుల అభిప్రాయం వ్యక్తం చేశారు ఏది చేయాలన్న ఇటువంటి కార్యక్రమాలు జరపడంలో మొక్క కుటుంబీకులు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ అనుకున్న పనులు వేగవంతం చేయడం యుద్ధ ప్రాతిపదిక్కిన పనులు చేపట్టి జిల్లా యంత్రాంగం దృష్టిలో శభాష్ అనిపించుకున్నారని పలువురు నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి. రూరల్ సీఐ శ్రీనివాసులు ఎస్సై సుజన్ కుమార్ విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ రంగనాథ్. నాగేంద్రఓబులవారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఆర్ఐ మల్లికార్జున రెడ్డి మండల సర్వేయర్ నాగలక్ష్మి పంచాయతీ అధికారులు త్రివేణి కంపెనీ కార్మికులు. కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర తల్లిని వెంకటరమణారెడ్డి గుత్తి నరసింహ గజేందర్ నాయుడు శివయ్య నాయుడు కోటి నాయుడు. బత్తిన వేణుగోపాల్ రెడ్డి సిగమాల మల్లికార్జునరెడ్డి గునిపాటి వేణు కల్లా చలపతి ఎర్ర బాబు శేఖర్ రెడ్డి ఎర్రబాబు మధుసూదన్ రెడ్డి తదితర కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## రైతు శ్రేయస్సు కోసమే తెలుగు దేశం ప్రభుత్వం



బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 25 ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తుందని సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో 50 మంది రైతులకు రాజముద్ర పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రైతులకు రాజముద్రతో అందిస్తున్న పుస్తకాల వలన ఆస్తులపై సర్వ హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాలనలో అన్నదాతల వ్యవసాయ సాగులో అన్ని వసతులు కల్పిస్తూ అభివృద్ధి లక్ష్యం పనిచేస్తుందని తెలిపారుఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఆర్ ఐనల్లయ్య, పలు ప్రభుత్వ శాఖ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వృద్ధుల కళ్లలో వెలుగు నింపిన గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్

**- 35 మందికి ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లకు ఏర్పాట్లు**




తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త: వృద్ధాశ్రమంలోని నిరుపేద వృద్ధులకు గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి వారి కళ్లలో వెలుగులు నింపింది. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ ఎం. వరలక్ష్మి, అధ్యక్షులు కుమారి సాయి దీపిక ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరం జరిగింది. శిబిరంలో దాదాపు 35 మంది వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది నరేష్ కృష్ణ, అంబికా, శ్రీనివాసులు, శ్రీదేవి సేవలందించారు. కంటి సమస్యలు గుర్తించిన వృద్ధులను తిరుపతిలోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు స్వయంగా తీసుకెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చికిత్స, ఉచిత శస్త్రచికిత్సలు అందించే ఏర్పాట్లు చేశారు. వృద్ధుల కళ్లలో వెలుగు నింపిన ఈ కార్యక్రమానికి స్థానికులు అభినందనలు తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**-అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య**

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 26 ప్రభాతవార్త: తీవ్ర అనారోగ్యం, వైద్య ఖర్చులు భరించలేక కుటుంబానికి భారంగా ఉండకూడదనే ఉద్దేశంతో పురుగుల మందు సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బి.ఎన్.కండ్రిగ మండలం నీర్‌పాకోట వైసీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మృతుడు కిన్నర గణేష్ (42), తండ్రి లేట్ రమణయ్య. గత నాలుగేళ్లుగా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్నాడు. దీనివల్ల కాళ్లు వాచిపోయి నిరంతర నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. గురువారం ఉదయం ఇంటి ముందు వాంతులు చేసుకుంటూ కనిపించాడు. భార్య, కుమారుడు కారణం అడగగా... తీవ్రమైన నొప్పి, వైద్య ఖర్చులు భరించలేకపోవడం, కుటుంబానికి భారంగా ఉండకూడదనే ఉద్దేశంతో పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు అద్దె వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరణంపై ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు బి.ఎన్.కండ్రిగ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తొండమనాడులో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న విదేశీయులు



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమ నాడులోని శ్రీదేవి, భూదేవి సమేత అభయ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గురువారం విదేశీయులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చైనా, కెన్యా దేశాలకు చెందిన భక్తులు దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. చైనాకు చెందిన మిస్టర్ చెన్, కెన్యాకు చెందిన అశోక్‌రెడ్డి వారితో పాటు రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన మణి రాజు, కిషోర్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత అర్చకులు గోపి స్వామి విదేశీయులకు వివరించారు. చారిత్రక, ఆధ్యాత్మిక పై వారు ఆసక్తి వ్యక్తం చేస్తూ ఆలయ చరిత్ర, సంప్రదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## రైతులకు 2,400 బస్తాల యూరియా సిద్ధం



తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై యూరియా అందించేందుకు తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంక్ చర్యలు చేపట్టింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ భీమల భాస్కర్ తెలిపారు. గురువారం బ్యాంక్ ఆవరణలో 105 టన్నుల యూరియా, అంటే దాదాపు 2,400 బస్తాలను దిగుమతి చేశారు. అందులో 260 బస్తాల యూరియాను గురువారం రైతులకు పంపిణీ చేశారు. ప్రతి రైతు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ పప్పు. చిరంజీవిరెడ్డి, ఏఈఓ ఎం ఎన్.సురేందర్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది శ్రీనివాసులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూతలపట్టు సీఐగా... తిమ్మయ్య బదిలీ

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 25 ప్రభాతవార్త: బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తిమ్మయ్య పూతలపట్టు సీఐగా బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన పోలీస్‌శాఖ సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిమ్మయ్య బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. త్వరలో ఆయన పూతలపట్టు సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## శేషాచలం కొండలపై ఆనంద నిలయం... రూపంలో మేఘమాలిక



రేణిగుంట జూన్ 25 ప్రభాతవార్త: రేణిగుంట విమానాశ్రయం సమీపం నుండి శేషాచలం కొండలపై గురువారం సాయంత్రం ఒక మేఘం శ్రీవారి ఆనంద నిలయం రూపంలో అద్భుతంగా గోచరించింది. ఆనంద నిలయం రూపంలో ఉన్న మేఘమాలికను చూసి పలువురు అబ్బురపడ్డారు. సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆనంద నిలయంలో అక్కడకు వచ్చాడా? అన్న భ్రాంతిని కలిగించింది. ఈ దృశ్యాన్ని చూసి పలువురు పులకరించి పోయారు.

# వరుస దొంగతనాల కేసులో...ఇద్దరి అరెస్టు

**-రూ.2 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**
**-ప్రధాన నిందితుడిపై 28 కేసులు**



తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలో కలకలం రేపిన వరుస గృహ దొంగతనాల కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి సుమారు రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను.. స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సిఐ నాగరాజు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బానాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ అడ్మిన్ ఎ. శ్రీనివాసులు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో ఈ ప్రత్యేక బృందాలు పనిచేశాయన్నారు. గురువారం సిఐ నాగరాజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరుస దొంగతనాల కేసుకు సంబంధించి మాట్లాడుతూ కేసుల ఛేదనలో తమ సిబ్బంది బాధ్యతా యుతంగా వ్యవహరించి నిందితులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. కేసు ఛేదనలో శ్రీకాళహస్తి రెండవ పట్టణ ఎస్ఐ వై. జ్యోతి నేతృత్వంలోని బృందం పిచ్చాటూరు టైలర్స్ కాలనీ రహదారిపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారని తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.పి. నరేష్ (42), ఆటో డ్రైవర్, వైకుంఠపురం ఆర్చ్ సమీపం, శ్రీకాళహస్తి. కల్లూరి జగదీష్ కుమార్ అలియాస్ జగదీష్ (43), రైల్వే ఉద్యోగి, అంజిమేడు, యెర్పేడు మండలం నిందితులు. శ్రీకాళహస్తి, గంగాధర నెల్లూరు, తిరుచానూరు తదితర ప్రాంతాల్లో పలు గృహ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైందని,ప్రధాన నిందితుడు పులి నరేష్‌పై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సుమారు 28 దొంగతనాల కేసులు ఉన్నట్లు సిఐ. సి.నాగరాజు తెలిపారు. అతను పాత నేరస్థుడు. ఇతర కేసులతో సంబంధంపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ కేసును ఛేదించిన వారిలో క్రైమ్ ఎస్ ఐ అనిల్, అరుణ్, బాబు, నరేష్, రమణ, గోపిలు ఉన్నారు.

## కార్మికుల సామర్థ్యం పెరగాలి



శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త: సాంకేతిక రంగం శరవేగంగా వృద్ధి చెందుతుందని పారిశుద్ధ్య కార్మికుల సామర్థ్యం కూడా పెరగాలని మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం హాలులో జరిగిన పారిశుద్ధ్య కార్మికుల సామర్థ్యబివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలకు కమిషనర్ కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. డిఇ రవి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో పలు అంశాలకు సంబంధించి కార్మికులకు శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ శిక్షణ కారక్రమాల్లో పారిశుద్ధ్య కార్మికులకు పట్టణ పరిశుభ్రత,ఘన వ్యర్థాల నిర్వహణ,వ్యర్థాలు వేరు చేయటం,వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఆరోగ్య భద్రతా ప్రమాణాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శానిటేషన్ రంగంలో మెరుగైన సేవలు అందించటానికి అవసరమైన నైపుణ్యాలను అబివృద్ధి చేయటం ప్రధానాంశంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్బంగా కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. కాబట్టి పారిశుద్ధ్య కార్మికులు కీలకమన్నారు. కార్మికులు సమర్థవంతంగా పని చేయుటకు ఇలాంటి శిక్షణలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈకార్యక్రమాల్లో డిఇ రవిప్రకాష్‌తో పాటు శానిటరీ కార్యదర్శులు దామోదరం,పవన్‌లతోపాటు వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా కమిషనర్‌కు కార్మికులు పచ్చదనాన్ని అందించే పచ్చని మొక్కలను అందించారు.

## స్వర్ణముఖి పునరుజ్జీవనానికి ఉద్యమం

**-ధర్మకర్తల మండలి సభ్యురాలు విశాలి**



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: కాలుష్యం, ఆక్రమణలతో క్షీణిస్తున్న పవిత్ర స్వర్ణముఖి నదిని పునరుజ్జీవింపజేసేందుకు స్వచ్ఛ స్వర్ణముఖి ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తేజోభారత్ సంస్థాపక అధ్యక్షురాలు, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం బోర్డు మెంబర్ కోలా విశాలి తెలిపారు. ఈ ఉద్యమానికి మద్దతు, మార్గదర్శకత్వం కోరుతూ గురువారం శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయ ఈవో బీకే వెంకటేశులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణముఖి నది కేవలం నది కాదని, మన ఆధ్యాత్మిక, పురాణ, సాంస్కృతిక, పర్యావరణ వారసత్వానికి సజీవ చిహ్నమని విశాలి పేర్కొన్నారు. పంచభూత క్షేత్రాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వర ఆలయం ఈ నదీ తీరాన్నే వెలసిందని, ప్రపంచ ప్రసిద్ధ శ్రీకాళహస్తి కలంకారీ కళ సైతం ఈ నది నీటిపైనే ఆధారపడిందని గుర్తుచేశారు. ప్రస్తుతం వ్యర్థాల విసర్జన, కాలుష్యం, అవగాహన లేమితో నది తీవ్ర సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోనే మోడల్ పర్యావరణ ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ఆలయ యాజమాన్యం సహకరించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ తరఫున ఈవో బీకే వెంకటేశులుకు ఎక్ పెడ్ మా కి నామ్ మొక్కను విశాలి అందజేశారు.

## చోకింగ్‌ను గుర్తిద్దాం ప్రాణాలను కాపాడుదాం




తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త: పిల్లల్లో అన్నవాహికలో ఆహారం ఇరుక్కుపోయి ఊపిరాడక ప్రాణాపాయం కలిగించే చోకింగ్ సమస్యపై శ్రీకాళహస్తిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎంజీఎం హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా విక్రమ్ సక్సెస్ స్కూల్, విశ్వభారతి స్కూల్, ది స్కూల్ లలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేశారు. పిల్లలు భోజనం చేసే సమయంలో అన్నవాహికలో ఆహారం అడ్డుపడితే వెంటనే ఎలా గుర్తించాలి,ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి ప్రథమ చికిత్స చేయాలనే అంశాలపై ఎంజీఎం హాస్పిటల్స్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఉమామహేశ్వర్ రావుఉపాధ్యాయులకు వివరించారు.

## మూడు సర్కిల్స్‌కు ఒకే సిఐ!

శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పోలీసు డివిజన్‌లోని మూడు సర్కిల్స్‌కు ఒకే సిఐ శరణ్యమయ్యారు. గురువారం బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్యను పూతల పట్టుకు బదిలి చేసారు. దాంతో సిఐల కొరత ఏర్పడింది. శ్రీకాళహస్తి అర్బన్ సిఐ ప్రకాష్‌కుమార్ మట్కా కేసులు సస్పెండ్ అయ్యారు. ఆయన బాధ్యతలను టూటౌన్ సిఐ నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు. గురువారం బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్యను మార్చటంతో ఆ బాధ్యతలను కూడా టూటౌన్ సిఐ నాగరాజుకు అప్పగించారు. టూటౌన్ పరిధే ప్రమాదాలు, నేరాలకు నిలయంగా ఉంది. అక్కడ పని చేయటమే భారం, అయితే వన్‌టౌన్ సిఐ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. టౌన్‌లో ఎప్పుడూ ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నారు. రెండు బాధ్యతలనే నిర్వహించటం కష్టంగా ఉన్న తరుణంలో బుచ్చినాయుడు కండ్రిగ బాధ్యతలను అప్పగించారు. ఒకే సిఐ ఇన్ని బాధ్యతలను నిర్వహించటం సాధ్యమా? ఇప్పటికే ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వస్తే పట్టించుకునేదిక్కు ఉండరనే భావం ప్రజల్లో ఉంది. ఒకే అధికారికి మూడు బాధ్యతలు అప్పగిస్తే ఏ బాధ్యతలు నిర్వహిస్తారు? జిల్లా అధికారులు స్పందించాల్సిన అంశం. పని చేయగల్గినంత బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుంది. అలాకాకుండా బాధ్యతలు అప్పగిస్తే ఏ ఒక్కదానికి న్యాయం చేయలేని పరిస్థితి చోటు చేసుకుంటుందనేది జిల్లా అధికారులకు తెలియనిది కాదు.

## డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో 85వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం బుధవారం పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం పని చేస్తున్న జనసేన నాయకులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిరుపేదలకు, బాటసారులకు, యాచకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శీను, మనీ, లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, కల్లిపూడి వెంకటేష్, నక్క ప్రసాద్, హరి, ఆరిఫ్, మహర్షి రెడ్డి, నవీన్, చందు, పసల ఎలిషా, రాజా, సాయి,వీర మహిళలుటౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత, పేట శారద, నారాయణ గాయత్రి, బత్తెమ్మ, ప్రత్యూషతదితరులు పాల్గొని సేవలందించారు.

## అయ్యప్ప ఆలయానికి రూ.1.17 లక్షల విరాళం



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొట్టే సాయి ప్రసాద్ తన జీతభత్యాన్ని నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి గురువారం విరాళంగా అందించి ఔదార్యం చాటుకున్నారు. చైర్మన్‌గా విధులు చేపట్టిన కొట్టే సాయి ప్రసాద్ దేవస్థానం నుంచి అందుకున్న జీతం రూ.1,17,000/- లను అయ్యప్ప ఆలయంలో బోరు వేయుటకు, మోటర్ ఏర్పాటుకు అందజేశారు. సనాతన ధర్మ పరిరక్షణ, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్కుశబరిమల అయ్యప్ప స్వామి తత్వమసి సేవా సమితి కమిటీ సభ్యులు అభినందించారు.

## రైతులకు ఎరువుల కొరత ప్రభుత్వం తీర్చాలి

**-ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు డిమాండ్**




శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి రైతులు పెట్టుకున్నటువంటి పంటలకు ప్రభుత్వం తక్షణమే ఎరువులు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామా నాయుడు జిల్లా ఉపాధ్యక్షులు జనమాల గురవయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని అప్పుచేసి పంట పెట్టుకున్న సమయానికి లేక ఎరువులు లేక ఎకరాకు 30 బస్తాలు పండించే ధాన్యం ఎరువుల కొరతో 15 కూడా పండించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 30వ తేదీ చలో విజయవాడ కార్యక్రమానికి రైతులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్యకు సన్మానం



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్యాని తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు తక్కలపాటి ప్రకాష్ నాయుడు,మాజీ కౌన్సిలర్ దేవినేని మోహన్ గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుబ్బయ్యని కలంకారి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని ప్రకాష్‌నాయుడు కొనియాడారు. రైతు సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున సుబ్బయ్య చేస్తున్న సేవలు అభినందనీ యమని మోహన్ గౌడ్ పేర్కొన్నారు.

## ఎరువుల యాప్‌ను రద్దు చేయండి




శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: యూరియా యాప్ రద్దు చేసి.. ఎరువుల అంగళ్ళ దోపిడీని అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం రైతు సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని ఓ ఎరువుల దుకాణంలో రూ.350 అదనంగా యూరియాపై వసూలు చేయడమే కాక, రైతుకు అవసరం లేనివి అధిక ధరకు అంటగట్టారని వాపోయారు. అసలే పెట్టుబడి భారం పెరిగిపోయి, గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఇది శరాఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కే రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమణయ్య, మండల అధ్యక్షులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయానికి రూ.1.20 లక్షల విరాళం



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో నిర్మించబోతున్న అయ్యప్ప స్వామి వారి దేవాలయం లోని ముఖ్య కట్టడమైన గర్భాలయ నిర్మాణానికి వంకాయల సిద్దులయ్య నేతృత్వంలో రూ.1,20,000 విరాళంగా గురువారం అందజేశారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ద్వారా ఈ సహాయ సహకారాలు అందించడం జరిగిందని శబరిమల అయ్యప్ప స్వామి వారి తత్వమసి సేవాసమితి కమిటీ సభ్యులు తెలిపారు.

## తిరుమలేశుని సన్నిధిలో బొజ్జల



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గురువారం తిరుమలేశుని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ల సహాకారం ఇతోధికంగా ఉందన్నారు. రెండేళ్ళలో ఎన్నో అభివృద్ధి చేయటానికి కలియుగదేవుని సహాకారాలు వర్ణనాతీతం అన్నారు.

## బఫర్ జోన్ ప్రాంతాల్లో భారీగా మట్టి తరలింపు

**- అటవీ శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టీకరణ**

**వరదయ్యపాలెం, జూన్ 25, ప్రభాతవార్త:** వరదయ్యపాళెం మండలంలోని బత్తలవల్లం, చెదులపాకం గ్రామాల పరిధిలో అటవీ భూముల సరిహద్దులను ఆనుకుని అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తు న్నారు. అటవీ భూములకు ఆనుకుని ఉన్న బఫర్ జోన్ ప్రాంతాల్లో భారీగా మట్టి తవ్వి తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు, ఏ ఉద్దేశంతో ఈ అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతు న్నారన్న విషయం తెలిసినా అధికార యంత్రాంగంలో చలనం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా అటవీ భూములను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతుండటం పర్యావరణ ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులను సంప్రదించగా, ఇటువంటి తవ్వకాలకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఫారెస్ట్ రేంజర్ తెలిపారు. గత మూడు నెలలుగా ఈ అంశంపై స్థానిక తహసీల్దార్‌కు నివేదికలు పంపుతున్నప్పటికీ స్పందన లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని భారీ గుంతలు తవ్వడం వల్ల అడవి జంతువులు ప్రమాదవశాత్తూ అందులో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా స్థానిక రాజకీయ నాయకులతో కలిసి కొంత మంది అధికారులు అక్రమ మట్టి రవాణా ద్వారా భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా యంత్రాంగం, గనుల శాఖ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం

**నాగలాపురం, జూన్ 25 ప్రభాతవార్త:** మండలంలోని 38 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 28వ తేదీ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా అంగన్ వాడీ కేంద్రాలలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల ద్వారా 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 4,551 మంది చిన్నారులు ఉన్నారని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# శ్రీ పట్టాభిరామయ్య ఆలయ కుంభాభిషేకం



రేణిగుంట జూన్ 25 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం శ్రీ పట్టాభి రామయ్య ఆలయంలో గురువారం కన్నుల పండువుగా మహా కుంభాభిషేకం జరిగింది. ముందుగా మహాయాగాన్ని నిర్వహించారు. ధర్మకర్తలు రెడ్డి వారి గోపాలకృష్ణా రెడ్డి, రెడ్డివారి దినకర్ రెడ్డి, రెడ్డివారి వేద కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో దేవాలయంలో ప్రతిష్ఠింపబడుతున్న విగ్రహాలకు కలశ అభిషేకాలు, క్షీరాభిషేకాలు, నవధాన్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గర్భగుడిలో ప్రతిష్టించారు. ధ్వజస్తంభానికి, గుడిలో ప్రతిష్టించిన శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత పట్టాభిరామునికి , అదేవిధంగా ప్రతిష్టించిన శ్రీ వేణుగోపాల స్వామి, పెరుమాళ్ స్వాములకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం జరిగింది. స్వామివారి

## వైభవంగా సీతారాముల కళ్యాణం.....

పెళ్లి భోజనాన్ని ప్రసాద రూపంలో భక్తులకు వడ్డించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అందరిని అలరించింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో నారికేళాలు, కదళీ, తదితర ఫలాలు పుష్పాలు సమర్పించి పూజలు నిర్వహించి శ్రీ పట్టాభిరాముని దీవెనలు అందుకున్నారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సీతారాముల మూలవిరాట్ విగ్రహాలు భద్రాద్రి సీతారాముల విగ్రహాల మాదిరి ఉండడం భక్తులను తన్మయ పరిచింది. ఆలయ ప్రాంగణమంతా జైశ్రీరామ్ నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎండ తీవ్రతను తట్టుకోవడానికి నిర్వాహకులు చలువ పందిళ్లు వేశారు. గ్రీష్మ తాపం నుండి ఉపశమనం పొందడానికి ప్రత్యేకంగా హై స్పీడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. మాండవ్య మహర్షి పురంగ పేరుగాంచిన గాజులమండ్యం మరో భద్రాద్రి, ఇంకో ఏకశిలా నగరం (ఒంటిమిట్ట) లను తలపించింది. నిర్వాహకులు భక్తులకు శ్రీరామునికి ఎంతో ప్రీతికరమైన వడపప్పు, పానకం (రామరసం) ప్రసాదాలుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ మానవులు ఎలా జీవించాలో తెలియజేసి మానవజాతికి శ్రీరాముడు ఆదర్శ పురుషుడైనాడని అన్నారు. మానవ రూపంలో శ్రీరామచంద్రునిగా జన్మించిన శ్రీమన్నారాయణుడు కొడుకుగా, భర్తగా, సోదరుడిగా, మిత్రునిగా, మంచి పరిపాలకునిగా, ఎలా నడుచుకోవాలో తెలియజేసిన గొప్ప అవతారమని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## బహిరంగ మద్యం సేవనంపై ఎక్సైజ్ పోలీసులు ఆంక్షలు

-మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు...మద్యం బాటిల్స్ సీజ్

తిరుపతిరూరల్,జూన్ 25 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవనంపై ఎక్సైజ్‌శాఖ పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. తిరుపతిరూరల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసానాయుడు ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నున్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడంపై నిషేధమని సి.ఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని సి.ఐ. నరసానాయుడు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎక్సైజ్ ఎస్.ఐ వి.కవీశ్వరనాయుడు, కానిస్టేబుల్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంగిరెడ్డిపల్లిలో మాజీ సిఎం నల్లారి కిరణకుమార్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 25 ప్రభాతవార్త:



గంగిరెడ్డిపల్లిలో మాజీ ఎంపిపి అత్తూరి వామాక్షి దామోదర్ రెడ్డి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. గురువారం ఆయన గంగిరెడ్డిపల్లికి చేరుకుని దామోదర్ రెడ్డి దంపతులను దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో కలసి సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కుమార్ స్వామి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాత వార్త

జనసేన తిరుమల కోశాధికారి కుమార్ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం రుయా ఆస్పత్రి వద్ద పేదలకు, రోగుల బంధువులకు అన్న దాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిరుపేదలకు అన్నప్రసాద పంపిణీ చేశారు.అంతకుముందు జనసేన నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో కుమార్ స్వామి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కుమార్ స్వామికి ఎమ్మెల్యేతో పాటు పలువురు జనసేన నాయకులు, స్నేహితులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమంలో అంకాలమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ కొండా రాజమోహన్, సాని శ్రీనివాస్, భాను, రమేష్ నాయుడు, ఆముదాల వెంకటేష్, ఆకుల జశ్వంత్,మణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బిజీ..బిజీ..

నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త :



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ప్రైవేటు కార్యక్రమాల్లో బిజీ బిజీగా గడిపారు. మండలంలోని కశింమిట్ట గ్రామానికి శేఖర్ కుమారుడు ప్రదీప్ వివాహం సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట హరి పంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వాదించారు. అలాగే కశింమిట్ట దళితవాడకు చెందిన లేట్ సడిసి శ్రీరాములు భార్య సులోచన మృతికి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే కుమారుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, సత్యవేడు నియోజకవర్గ టిడిపి బూత్ ఎజెంట్ల కన్వీనర్ కోనేటి సుమన్‌కుమార్ భీమునిచెరువు గ్రామంలో వేపగుంట కృష్ణ ధనలక్ష్మీ దంపతులు కొత్తగా నిర్మించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు

## సిఆర్ఎస్‌లో నూతన ఒరవడికి శ్రీకారం

మరణించిన కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం

రేణిగుంట జూన్ 25 ప్రభాతవార్త



రేణిగుంట (తిరుపతి) సిఆర్‌యస్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సిఆర్ఎస్ ఉద్యోగులు సమకూర్చిన ఆర్థిక సహాయంతో ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందించి నూతన ఒరవడికి సి డబ్ల్యూఎం ఆనంద్ గురువారం శ్రీకారం చుట్టారు. సి ఆర్ ఎస్ లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ ప్రక్రియకు సిడబ్ల్యూఎం ఆనంద్ నాంది పలికారు.. సాయం అందించడానికి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులు ముందుకు రావడం హర్షణీయమని అభినందించారు. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు చేస్తున్న సాయం చిన్నదైనప్పటికీ బాధల్లో ఉన్న ఆ కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కోరిన వెంటనే సాయం చేయడానికి ముందుకు వచ్చిన ఉద్యోగులకు కార్మికులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.. ఇటీవల మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలు సిడబ్ల్యూఎం కార్మికుల సహకారంతో ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ ప్రమోద్, డబ్ల్యూపిఓ శ్రీనివాస నాయక్, సీఎంటి ఎస్.కే కాజా, డబ్ల్యూఎం భానుప్రకాష్, ఎడబ్ల్యూఎం నవీన్ కుమార్, సిఆర్ఎస్ ఆఫీస్ సిబ్బంది, అధికారులు, సంఘ్, యూనియన్, ఒబిసి, ఎస్సీ,ఎస్టీ నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి దామోదర్ రెడ్డి దంపతులకు భూమన, చెవిరెడ్డి శుభాకాంక్షలు



రామచంద్రాపురం, జూన్ 25 ప్రభాతవార్త:

మాజీ ఎంపిపి అత్తూరి వామాక్షి దామోదర్ రెడ్డి దంపతులను మాజీ ఎంఎల్ఏలు భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం గంగిరెడ్డిపల్లిలో జరిగిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి వారిరువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా దంపతులను దుశ్శాలువలతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, బోడ్రెడ్డి నిరంజన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎద్దల దొరస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడులో అన్న క్యాంటీన్‌ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే హేమలత

సత్యవేడు, జూన్ 25 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడులో గురువారం మాజీ ఎమ్మెల్యే హేమలత అన్న క్యాంటీ న్‌ని సందర్శించారు. అక్కడ స్వయంగా టోకెన్ తీసుకుని భోజనం చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత క్యాంటీన్ నిర్వహ ణను పరిశీలించారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు 200 పై చిలుకు అన్న క్యాం టీన్‌ని ఏర్పాటు చేశారని ఆమె పేర్కొన్నా రు. క్యాంటీన్ సిబ్బందితో కలసి భోజనం చేశారు. పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. సత్యవేడు నియోజకవర్గంలో మరిన్ని అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసేందుకు సీఎం, మంత్రి నారా లోకేష్ ఇరువురితో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర,జూన్ 25 ప్రభాతవార్త :



సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం వుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సియల్‌ఆర్‌సి భవనంలో సదాశివపురం యంపిపి పాఠశాలలో పని చేస్తున్న యస్‌జిటి ఉపాధ్యాయ రాలు పి.తిలోత్తమ వెంకటేశ్వరరెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అథిదిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని మంచి పౌరుడుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే గొప్ప వారు గురువులని ఆయన కొనియాడారు.అనంతరం పదవీ విరమణ చేసిన తిలోత్తమ వెంకటేశ్వరరెడ్డిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి,యంపిడిఓ శివప్రసాద్‌వర్మ, తహశీల్దారు ఈశ్వర్,మండల విద్యాశాఖాధికారులు వసుమతి, శ్రీధర్‌రాజు,నాయకులు మురళీనాయుడు,నాగభూషణంరాజు,శివయ్య,విజయకుమార్,రవినాయుడు,రమేష్,శరవణ,పాల్గొన్నారు.

## బాల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



విజయపురం, జూన్ 25 ప్రభాతవార్త:

విజయపురం మండలం గొల్లకంద్రిగ సమీపంలో నెలకొల్పిన అన్నమయ్య పాల ఉత్పత్తి కేంద్రాన్ని గురువారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ము ఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని అన్నమ య్య మిల్క్ డెయిరీ యాజమాన్యం ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరిగిన యజ్ఞ హోమం పూజ కార్యక్రమంలో పాల్గొని డెయిరీ యాజమాన్యంకి శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

రామచంద్రాపురం, జూన్ 25 ప్రభాతవార్త:



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన గురువారం రాయలచెరువు పేట గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గంగముని రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి పొలం పనులకు వెళ్ళారు. ఇంటిపై వున్న విద్యుత్ తీగల నుండి నిప్పులు రాలిపడి పూరిల్లు మంటల్లో చిక్కుకున్నది. చుట్టుప్రక్కల ప్రజలు గమనించి మంటలు అదుపు చేశారు. అప్పటికే మంటలు వ్యాపించి ఇంట్లోని దుస్తులు, నిత్యవసర వస్తువులను పూర్తిగా దహించివేశాయి. ఈ నేపధ్యంలో మాజీ సర్పంచ్ మురగయ్య బాధిత కుంటుంబాన్ని పరామర్శించి ఇల్లు నిర్మించుకునే సమయంలో తనవంతుగా ఆర్థిక సహాయం అందించగలనని హామీ ఇచ్చారు.

## ప్రవేశాల ప్రక్రియకు విశేష స్పందన: ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాబు



325కు చేరిన విద్యార్థుల సంఖ్య

తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాత వార్త

తిరుమల తిరుపతి దేవస్థానమ్స్ నిర్వహణలోని జూనియర్ కళాశాలల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా మూడవ విడత రెండవ రోజు గురువారం శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజీ లో వివిధ గ్రూపుల్లో 19 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాబు తెలిపారు.ఈ ప్రవేశాలతో కలిపి ఇప్పటివరకు కళాశాలలో మొత్తం 325 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఆయన వెల్లడించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ తదితర గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ కళాశాల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని ఆయన చెప్పారు. మూడవ విడత ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాబు సూచించారు. కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రవేశాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని ఏకాదశి ఉత్సవ వేడుకలు

నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త:



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో గురువారం ఏకాదశి ఉత్సవంతో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామి వారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యావచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషే కించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్వాతి నక్షత్ర పూజలు

నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామపరిధిలోని శింగిరికోనలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ంలో గురువారం స్వాతి నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లను పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీరు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు మూడు పూట్ల ఉచిత అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు జలపాతంలో కూడా పవిత్ర స్నానాన్ని ఆచరించారు. అలాగే ఆలయంలో సుదర్శన్ హోమంను తిరుపతి నుంచి వచ్చిన అర్చకులు ఘనంగా నిర్వహించారు.

## తిరుపతిలో ఆనంద్ మెడికల్ అకాడమీ ప్రారంభం

తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాత వార్త



నీట్ కోచింగ్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఆనంద్ మెడికల్ అకాడమీ (ఆనంద్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్) తిరుపతి బైరాగిపట్టెడలో తన నూతన క్యాంపస్‌ను గురువారం ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తిరుపతి అంతర్జాతీయ విద్యా హబ్‌గా మారుతున్న తరుణంలో, కర్ణాటకలో గొప్ప ట్రాక్ రికార్డ్ ఉన్న ఆనంద్ మెడికల్ అకాడమీ ఇక్కడ బ్రాంచ్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నీట్ కోచింగ్ లభించడం ఒక సువర్ణ అవకాశమని, భవిష్యత్ వైద్యులను తీర్చిదిద్దడంలో ఈ సంస్థ వంద శాతం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షి ంచారు.అకాడమీ చైర్మన్, జాతీయ గోల్డ్ మెడలిస్ట్ ఆనంద్ పోతిన మాట్లాడుతూ, కర్ణాటకలో తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 1,000 మందికి పైగా డాక్టర్లను అందించామని, అదే నాణ్యమైన విద్యా విధానాన్ని ఇప్పుడు తిరుపతి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. తిరుపతి బ్రాంచ్ అకడమిక్ లీడర్ ప్రకాష్ సాహూ, సీనియర్ అధ్యాపకులు వెంకట పవన్ కుమార్ నేతృత్వంలోని నిపుణులైన ఫ్యాకల్టీ టీమ్ ద్వారా విద్యార్థులకు పటిష్టమైన కోచింగ్, పర్సనలైజ్డ్ మెంటరింగ్ లభిస్తుందని పేర్కొన్నారు.పద్మావతి పార్క్ సమీపంలోని సిటీ యూనియన్ బ్యాంక్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఈ అకాడమీలో అడ్మిషన్ల కొరకు +91 77999 98885, +91 94904 08497 నంబర్లలో సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు , కర్ణాటక ఆనంద్ పీయూ కాలేజ్ ప్రిన్సిపాల్ అవినాష్ జె. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 28న పల్స్ పోలీయోను విజయవంతం చేద్దాం : డాక్టర్ దర్శిత్‌రాజ్

నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త :






ఈనెల 28వతేది ఆదివారం జరగనున్న పల్స్ పోలీయో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లు దర్శిత్‌రాజ్, రాగసుధలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 27 బూతులు, 0నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అదనపు పోలీయో చుక్కలను వేయించాలన్నారు. ఈ సమాచారాన్ని ప్రజలందరికి తెలియజేసి పూర్తి చేయాలన్నారు. మిగిలిన వారికి 29, 30వ తేదీల్లో చుక్కలను వేయించి 100శాతం పూర్తి చేసే విధంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోహెల్త్‌సూపర్‌ఎ ైజర్లువరలక్ష్మీ,యశోద,అంగన్‌వాడీసూపర్‌వైజర్ బేబి, సిబ్బంది అందరు పాల్గొన్నారు.

## టిడిపి నేత రాం ప్రసాద్ నాయుడు మృతికి పలువురు నివాళి

పెనగలూరు, జూన్ 25 ప్రభాతవార్త



రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం టిడిపి నేత నాగినేని రాం ప్రసాద్ నాయుడు ఆకస్మిక మరణంతో పలువురు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. మండలం పార్టీకి ఆయన లోటు తీర్చలేనిదన్నారు. రాజంపేట పార్లమెంట్ తెలుగుయువత నాయకుడిగా, యూనిట్ ఇంచార్జిగా, ప్రస్తుతం మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా పార్టీ చేస్తున్న సేవలు మరువలేనివి. ప్రసాద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంభానికి శ్రీ వెంకటేశ్వర స్వామి ధైర్యాన్ని నింపాలని కోరుకుంటూ నివాళులు అర్పించారు.

**CHANGE OF NAME**

● I,KUDUM MASTAN SUBBARATNAMMA (Old Name), W/o KUDUM MASTAN KRISHNAMURTHY, R/o DNo: 2-363-A4, Society Colony, Madanapalle, Annamayya Dt.,A.P.,Have changed my name and shall henceforth be known as KUDUM MASTAN SUBARATNAMMA (New Name

# జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం**




వెంకటగిరి, జూన్ 25 ప్రభాతవార్త: నైపుణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా అధికారి ఆర్ లోకనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నైపుణ్య అభివృద్ధి సంస్థ వారు జాబ్ మేళాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత యువకులకు జాబ్ మేళ వరము లాంటిదని చెప్పారు. నిరుద్యోగ సమస్యను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని, మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ ముఖ్యమంత్రి సూచనల మేరకు వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించ బడుతుందని తెలియజేశారు. ఇందులో భాగంగానే ఈరోజు గవర్నమెంట్ ఐటిఐ, వెంకటగిరి నందు నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ఇక్కడ ఈరోజు జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా జాబ్ మేళాను ఉద్దేశించి మాట్లాడుతూ యువతి యువకులు ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు ఇంటర్వ్యూకు హాజరై ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఐటిఐ ప్రిన్సిపాల్ చంగల్ రాయన్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యులు వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో వివిధ కంపెనీల వారితో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఈ జాబ్ మేళాకి 203 మంది హాజరవ్వగా, 105 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అవడం జరిగినది, అలాగే 31 మంది షార్ట్ లిస్ట్ చేశారు. ఏపీ ఎస్ఎస్‌డిసి, గవర్నమెంట్ ఐటిఐ సిబ్బంది, ఏపీ ఎస్ఎస్‌డిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేగం అందుకోని పనులు...వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం



శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త: బాగున్న మురుగునీటి కాలువలను తొలగించారు. తుడా నిధులిస్తుంది కదా అని ఉన్న కాలువలను తొలగించి కొత్త కాలువల నిర్మాణానికి గతంలో పని చేసిన కమిషనర్ పూనుకున్నారు. నెలలు గడుస్తున్నా కాలువల నిర్మాణం నత్తనడకన నడుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుడా నిధుల పనులు దిశ దెశ నిర్దేశం లేకుండా సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా ఉందని, అంతేకాక పనులు జరుగుతున్నపుడు పర్యవేక్షణ లేకపోవటంతో, అడ్డదిడ్డంగా సాగుతున్నాయనే విమర్శలు బాహాటంగా ఉంది. తుడా నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అవగాహన లేకుండా ఎత్తుగా కాలువలు నిర్మించడం, ఆ పై రోడ్లు తక్కువ ఎత్తులో నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతనెల్లూరు బస్టాండు వద్ద నెలలకు ముందు ఉన్న కాలువల మీద శ్లాబులను తొలగించారు. తీరా పనులు చేపట్టక, దాంతో మురుగుపై వ్యర్థాలు చేరి గందగోళంగా మారింది. నిధులు మంజూరు చేసిన తుడా డిఇ పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతుంది. దాంతో పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

**కాలువలు నిర్మించరు...వ్యర్థాలు తొలగించరు!**

శ్రీకాళహస్తి పట్టణంలోని వీర ముష్టిపాళ్యం, జయరామారావు వీధి, పెద్ద మసీదు వీధిలో మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపైకి వచ్చి పాత బస్టాండ్ వద్ద వరదలాగా పేరుకుపోతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని నెలలుగా కాలువలో పూడిక తీయకపో వడంతో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో కాలువ పూర్తిగా మూసుకుపోయింది. కాలువపై తాత్కాలికంగా వేసిన చెక్క బ్రిడ్జి పక్కనే దుకాణాలు, నివాసాలు ఉండటంతో దుర్వాసన భరించలేకుండా ఉందని వ్యాపారులు వాపోయారు. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. షాపుకు వచ్చే కస్టమర్లు ముక్కు మూసుకుని వెళ్లిపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షాకాలం సమీపిస్తున్నందున యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింత దిగజారుతుందని వారు హెచ్చరించారు.

# రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**అనంతపురం జిల్లా బొంతవాడ గ్రామ శివార్లలో 109 ఎర్రదుంగలు డంప్‌పై టాస్క్ ఫోర్స్ దాడి..**
**ముగ్గురు అనంతపురం జిల్లా స్మగ్గర్లు అరెస్ట్**




తిరుపతి కార్పొరేషన్, జూన్ 25 ప్రభాతవార్త: ఎర్ర చందనం అక్రమ రవాణా ను అడ్డు కోవడంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అనంతపురం జిల్లా రేగిడి కొత్తూర్ పంచాయతికు చెందిన నల్లాని నంద కుమార్( 32), అతనితో పాటు నల్లాని జయరామయ్య, బొట్టు రాఘవేంద్రలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికించి ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం టాస్క్‌ఫోర్స్ బృందం, అటవీ సిబ్బందికి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అనంత పురం జిల్లా, నార్పల మండలం, బొందల వాడ గ్రామ పొలిమేరలో అదుపులోకి తీసుకోని వారి నుండి ఒక కారు తో సహా 109 ఎర్రచందనం దొంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్ ఎస్పీ. పి.శ్రీనివాస్, ఆడిషినల్ జె. కులశేఖర్ ఆధ్వర్యం లో శేషాచల అడవులలో ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆపరేషన్ లు నిర్వహించడంతో పాటు, ఎర్ర చందనం కేసులలో ముద్దాయిలుగా ఉంటూ తప్పించుకొని తిరుగుతున్న అంతర రాష్ట్ర స్మగ్లర్లను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ముద్దాయిలు ఒక ముఠాగా ఏర్పడి ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని డంప్ గా చేసి ఎక్కువ మొత్తం లో డబ్బులకు ఢిల్లీ, తమిళనాడు మరియు కర్ణాటకకు చెందిన బడా ఎర్ర చందనం స్మగ్లర్లు కు అమ్ముకుందాం అని కూలీల ద్వారా శేషాచలం అడవిలో ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని దుంగలుగా చేసి వాటిని అనంత పురం జిల్లా, నార్పల మండలం, అనంతపురం డివిజన్, రేంజ్ మరియు ఫారెస్ట్ సెక్షన్, దుర్గం ఫారెస్ట్ బీటు పరిధిలో బొందలవాడ గ్రామము నుండి బొమ్మలాట పల్లి గ్రామానికి వెళ్ళు మట్టి రోడ్డు మార్గంలో జయరామయ్య కు చెందిన పొలంలో ఉన్న ఒక రేకుల షెడ్ పక్కన డంప్ చేసి దాచిన 109 ఎర్ర చందనం దుంగల తో సహా పై ముగ్గురు వ్యక్తులను మరియు ఒక కార్ ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మొత్తం 109 ఎర్రచందం దుంగలు వాహనము తో సహా విలువ సుమారు 02 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ స్మగ్లింగ్‌లో ఇతర ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఎర్ర చందనం దొంగలు, వాహనం ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అంతర రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ బృందాన్ని తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

## ట్రాక్టర్ కింద పడి మామిడి రైతు మృతి!



గుడిపాల, జూన్ 25 ప్రభాతవార్త: మామిడి కాయలను కోసి ట్రాక్టర్‌లో వేసుకుని ఫ్యాక్టరీకి వెళ్ళిన మామిడి రైతు తిరిగిరాని లోకాలకు తరలివెళ్ళిపోయాడు. గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లి గ్రామ పరిధిలో వున్న మామిడి పల్ప్ ఫ్యాక్టరీకి యాదమరి మండలం కొట్టాలం గ్రామం నుండి మామిడి కాయలను ట్రాక్టర్‌తో పాటు తీసుకువచ్చిన రైతు అనిల్‌కుమార్(30) బుధవారం అర్ధరాత్రి ట్రాక్టర్ ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా వున్నాయి. యాదమరి మండలం కొట్టాలం గ్రామంకు చెందిన రైతు అనిల్‌కుమార్ తన ట్రాక్టర్‌లో గుడిపాల మండలం 189 కొత్తపల్లి గ్రామంలో వున్న పల్ప్ ఫ్యాక్టరీకి రెండు రోజుల క్రితం మామిడి కాయలలోడ్ తీసుకువచ్చాడు. ఫ్యాక్టరీ పరిసరాల్లో ట్రాక్టర్‌ను నిలిపిన రైతు అనిల్‌కుమార్ తనకు కేటాయించిన వరుస సంఖ్య ఎప్పుడు వస్తుందా! అని ఎదురు చూడటం ప్రారంభించాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కావస్తున్నప్పటికీ తన వరుస సంఖ్య రాకపోవడంతో అలసిన రైతు అనిల్‌కుమార్ తన ట్రాక్టర్ వెనుక టైరుకు సమీపంలో పడుకుని నిద్రపోయాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో రైతు అనిల్‌కుమార్‌కు సంబంధించి వరుస టోకన్ నెంబర్ రావడంతో ట్రాక్టర్‌లో వున్న మామిడి కాయలు లోడ్‌ను అన్‌లోడ్ చేయడానికి మైక్‌లో అరచినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ట్రాక్టర్ కింద నిద్రిస్తున్న అనిల్‌కుమార్‌ను గుర్తించకుండా అనిల్‌కుమార్‌తో పాటు వచ్చిన అదే గ్రామానికి చెందిన అతని బంధువు రాజ్‌కుమార్(29) మామిడిని అన్‌లోడ్ చేయడానికి ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. అయితే ట్రాక్టర్ ట్రాలీ కింద నిద్రిస్తున్న అనిల్‌కుమార్‌కు ఇదేమి తెలియకపోవడంతో వెనుక నుండి ట్రాక్టర్ అనిల్‌కుమార్ చాతిపై ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ రామ్మోహన్‌కు సమాచారం అందడంతో ఆయన హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాదక ద్రవ్యాలు వినియోగం అనర్థం



తిరుపతి,జూన్ 25ప్రభాతవార్త: అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి ఉమాదేవి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, వ్యసనాలు వాటి నిర్మూలన అనే అంశం పై చర్చ జరిగింది. వివిధ శాఖల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమోళి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం గురించి వివరించారు. డాక్టర్ టి. ఉమాదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం, విద్యా ప్రగతి, కుటుంబ జీవితం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని మనలో ఉన్న ఒత్తిడి తగ్గాలంటే బుక్స్ చదవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని వివరించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుత పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

## కళ్యాణ వెంకన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**టిటిడి జెఈఓ డాక్టర్ శరత్**



చంద్రగిరి, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీవారి భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పురావస్తు అధికారులను సమన్వయం చేసుకుని పనులు ప్రారంభించనున్నట్లు టిటిడి జెఈఓ డాక్టర్ శరత్ తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై గురువారం ఆయన పురావస్తుశాఖ అధికారులతో కలసి ఆలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పురావస్తుశాఖ ఆధీనంలోని కళ్యాణ వెంకన్న ఆలయంలో చేపట్టవలసిన ప్రతి అభివృద్ధి పనికి ఏఎస్ఐ అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సి వుందన్నారు. ఇందులో భాగంగా భక్తులకు అసౌకర్యం కలిగించని అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ త్రాగునీటి సౌకర్యాల మెరుగుదల, క్యూలైన్ల అభివృద్ధి, మెట్లు మరమతులు, యాగశాల నిర్మాణం, పోటు నిర్మాణం వంటివి తమ ప్రణాళికలో వున్నట్లు తెలిపారు. ఇందులో క్యూలైన్లకు సంబంధించి తమ ప్రతిపాదనపై పురావస్తుశాఖ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదేవిధంగా కళ్యాణమండపం, ఆలయ ప్రాంగణంలోని ఇతర సౌకర్యాల అభివృద్ధికి సమగ్ర నివేధికను సిద్ధం చేసి పురావస్తు శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనుమతులు వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపధికన పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మనోహరం, సిపిఆర్ఓ డాక్టర్ పి.రవి, అడిషినల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి కేవీబీ పురం జడ్పీహెచ్ఎస్ ప్రతిభావంతులు

**న-ఉత్తమ ప్రతిభ కనబరచిన ముగ్గురు విద్యార్థినులకు అరుదైన ప్రోత్సాహం**

**న-దాత కరపారెడ్డి కందస్వామి సహకారంతో వినూత్న కార్యక్రమం**








కేవీబీ పురం, జూన్ 25 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభకనబరచిన విద్యార్థినులు దీక్షిత, ఎలినా లిథియాల్, వెంకటలక్ష్మిలకు 'కలలకు రెక్కలు' పేరుతో అరుదైన ప్రోత్సాహక కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురష్ ప్రారంభించారు. ఈ వినూత్న కార్యక్రమానికి ప్రముఖ దాత కరపారెడ్డి కందస్వామి ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన ఈ ముగ్గురు విద్యార్థినులను విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి అక్కడి ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలు ఎర్రకోట, కుతుబ్మినార్, లోటస్ టెంపుల్, అక్షరధామ్, రాష్ట్రపతి భవన్, పార్లమెంట్, జంతర్ మంతర్, ఇండియా గేటు, నేషనల్ మెమోరియల్, రాజ్‌ఘాట్, మీ భూమి కిసాన్ ఘాట్ మొదలగు ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థినుల రక్షణ, పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు వసుంధర దేవి స్వీకరించి, వారితో కలసి ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఢిల్లీకి పయనమయ్యారు. వారికి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్‌ని ఉజ్వలంగా తీర్చిదిద్దే దిశగా కలలకు రెక్కలు కార్యక్రమం ఆదర్శ ప్రాయమని ప్రశంసించారు. గురువారం రేణిగుంట విమానాశ్రయంకి చేరుకోనున్న కేవీబీ పురం విద్యార్థినులు కేవీబీ పురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కేవీబీ పురం)లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులు దీక్షిత, ఎలినా లిథియాలో, వెంకటలక్ష్మిలకు కలలకు రెక్కల పేరుతో అరుదైన ప్రోత్సాహక కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి విమానంలో ప్రధానోపాధ్యాయుడు కూరపాటి సురేష్ ఢిల్లీలో పలు ప్రదేశాలను చూపించి గురువారం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోనున్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## నేడే రోసనూరులో ప్రజా దర్బార్

పెళ్లకూరు, జూన్ 25 ప్రభాతవార్త : మండలంలోని రోసనూరు గ్రామంలో సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు నెలవల. విజయశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సాయంకాలం నాలుగు గంటలకు స్వర్ణ గ్రామ కార్యాలయ ఆవరణంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించబడుతుందని పెళ్లకూరు మండలం ఎంపీడీవో వేనయ్య పత్రికలకు విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మండలంలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు



సూళ్లూరుపేట, జూన్ 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నూతన ఎంపీడీవోగా వై.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న మురళీకృష్ణను ఇటీవల స్వచ్ఛ రథాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసిన విషయం విధితమే.

## ఈ నెల 30న సియం రాయబారంకు ఛలో విజయవాడ

**- సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి**



వెంకటగిరి, జూన్ 25 ప్రభాతవార్త : రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన విజయవాడలో ఛలో సియం రాయబారంకు పెద్ద ఎత్తున తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి పిలుపునిచ్చారు. బుధవారం వెంకటగిరి నియోజక వర్గ సమితి సమావేశం కల్లూరు జాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించు కోకుండా మోసం చేస్తున్నదన్నారు. సకాలంలో విత్తనాలు ఇవ్వక పోవడం, పండిన పంటలుకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు దళారీ వ్యవస్థ పెరిగిపోవడం వల్ల రైతాంగం పూర్తిగా నష్ట పోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తి ఐనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా చైతన్యవంతమై తిరగబడాలని అందులో భాగంగానే రైతాంగం సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 30 తేదీ న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జూలై 16,17,18 తేదీలలో తిరుపతిలో జరిగే సిపిఐ శాఖ కార్యదర్శిల వర్క్ షాపును కూడా జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నియోజక వర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య, జిల్లా సమితి సభ్యులు ఎన్ శ్రీరాములు, వరుణ్ కుమార్, యం బలరాం నాయుడు, బాలాజీ, మునీంద్రా, వెంకటయ్య, ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నాటికి రెండవ దశ ఇళ్ళ పంపిణి!

**-చెక్కుల పంపిణిలో కమిషనర్**



శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని టిడ్కో ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి రెండవ దశలో సుమారు 2వేలమందికి అపార్టుమెంట్లు ఇవ్వటానికి సన్నాహాలు చేస్తున్నామని కమిషనర్ కెవి కృష్ణారెడ్డి తెలిపారు.గురువారం ఇక్కడ ఇళ్ళు తీసుకోని వారికి సంబంధించిన డిపాజిట్లు వాపసు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. 10 మందికి రూ.8.12లక్షల చెక్కులను అందించారు.ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 6వేలకు పైగా టిడ్కో ఇళ్ళకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్నారని అయితే ఏదో కారణాలతో కొంత మంది కట్టిన డిపాజిట్ వాపసు తీసుకోవటానికి నిర్ణయించు కున్నారు. ఇక్కడ ఇళ్ళను గత నెల 1900 మందికి స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఇళ్ళను అప్పగించారు.ఇక్కడ 4068 మందికి ఇళ్ళు మంజూరు కాగా రూ.లక్ష లు చెల్లించిన లబ్దిదారులకు డబుల్‌బెడ్ రూం ఇళ్ళను అప్పగించారు. మిగిలిన సుమారు 2100 మందికి ఇవ్వాల్సి ఉందని ఈ ఇళ్ళను ఆగస్టు 15 నాటికి సిద్దం చేయుటకు శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి ఆదేశించారని కమిషనర్ వివరించారు. నేడు 10 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణి చేసామని మిగిలిన వారికి వారు ఆధారిత రికార్డులను అందిస్తే వారి ఖాతాల్లో జమచేయబడుతుందని వివరించారు.ఈ కార్యక్రమాల్లో కమిషనర్ కృష్ణారెడ్డితో పాటు టిడ్కో ఇళ్ళ ఫైల్‌ను పరిశీలిస్తున్న ఎఇఇ శ్రావణి పాల్గొన్నారు.

## నో సూసైడ్, భ్రూణ హత్యలను నిర్మూలిద్దాం

**- మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి**



పులిచెర్ల, జూన్ 25 ప్రభాతవార్త : ఆత్మ హత్యల నివారణకై ప్రజల్లో అవగాహనా పెంపొందించేందుకు జూన్ 15 నుండీ జులై 15 వరకు నెల రోజుల పాటు నో సూసైడ్ మహోత్సవాలపై నిర్వహించబడుతున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిని వెంకటేశ్వరిఆదేశాల మేరకు నో సూసైడ్ అనే కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ వాణిశ్రీ దేవి మాట్లాడుతూ జూన్ నెల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఈరోజు చిత్తూరు జిల్లా పులిచెర్ల ప్రాజెక్ట్ పరిధిలోని పులిచెర్ల మండలంలోని జడ్పీహెచ్ఎస్ పులిచర్ల హై స్కూల్ నందు సమావేశం కార్యక్రమంలో మహిళలు నో సూసైడ్ అనే అంశం పైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌమార వయస్సులో వచ్చే ముందస్తు గర్భ దారనల నియంత్రణ, బాల్య వివాహాల నియంత్రణ, మరియు బివి 31,యొక్క విషయాలను ఇంకా సైబర్ క్రైమ్‌లోని పలు రకాల సమస్యల గురించి అవగాహన నిర్వహించారు. అలాగే సఖి వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మిన్ కె. చందూరాణి మాట్లాడుతూ మహిళలు ఆత్మ హత్యలు చేసుకోకుండా, ప్రణాళిక బద్ధంగా సమస్యలు ఆదిగమించవచ్చని మహిళలకు డివి, పోష్, డౌరీ ప్రోహిబిషన్ యాక్ట్ ఉన్నాయని, అదేవిధంగా హెల్ప్ లైన్ నెంబర్లు 14416 మెంటల్ హెల్త్ హెల్ప్ లైన్ నెంబర్, మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, యొక్క ప్రాముఖ్యతను అవి ఏ విధంగా పనిచేస్తున్నాయని అలాగే వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న ఐదు రకాల సేవలు కోసం అందిస్తున్న వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వాణి శ్రీదేవి, ఓఎస్‌సి అడ్మిన్ చందు రాణి, సూపర్వైజర్లు విజయలక్ష్మి, ఎఎన్ఎం సుహాసిని, శిరీష, మల్లేశ్వరి, అంగన్వాడి వర్కర్లు, ఆశ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ నియామకం

శాంతిపురం మండలం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల, ఎంకె పురంనందు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టును కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా నియామకం చేయబడును. ఆసక్తిగల అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానించ బడుతున్నాయి.

**పోస్టు వివరాలు**

**పోస్టు పేరు : అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్, విద్యార్హత : ఇంటర్మీడియెట్ మరియు డి.ఇడి ఉత్తీర్ణతతో పాటు ఉర్దూ భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి**

**ఖాళీల సంఖ్య: 01. దరఖాస్తు గడువు : ఈ ప్రకటన వెలువడిన మూడు రోజులలోపు దరఖాస్తులను ఆసక్తిగల అభ్యర్థులు అవసరమైన ధృవపత్రాలతో ఎంఇఒ కార్యాలయం, శాంతిపురంలో సమర్పించవలెను.**

**మండల విద్యాశాఖాధికారి 1 మరియు 2**
**శాంతిపురం మండలం**